



నిరసన చేపడుతున్న ఆశాలు, నాయకులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..!

- రెండో రోజూ కర్నూలు బాలోత్సవం - సాంస్కృతిక కార్యక్రమాలతో ఒత్తిడి దూరం
- ముగింపు కార్యక్రమంలో వక్తలు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి/కలెక్టరేట్

కర్నూలు బాలోత్సవం రెండో రోజూ శుక్రవారం కర్నూలు నగరంలోని మాంటిస్సోరి ఇండస్ పాఠశాల వేదికగా ఉల్లాసంగా.. ఉత్సాహంగా.. సాగింది. రెండో రోజు విద్యార్థులకు జానపద నృత్యం, నృత్యం, దేశభక్తి గీతాలాపన, విచిత్ర వేషధారణ, ఏకపాత్రాభినయం, లఘు నాటిక పోటీలను నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో ఒత్తిడి దూరం అవుతుందని ముగింపు కార్యక్రమంలో వక్తలు పేర్కొన్నారు. కర్నూలు బాలోత్సవం ప్రధాన కార్యదర్శి జెఎన్.శేషయ్య అధ్యక్షతన ముగింపు కార్యక్రమం నిర్వహించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు కెవి.సుబ్బారెడ్డి విద్యా సంస్థల ఛైర్మన్ కెవి.సుబ్బారెడ్డి, ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ బి.శంకర శర్మ, ప్రయివేట్ విద్యాసంస్థల సంఘం సలహాదారులు పివిబి.సుబ్బయ్య, మైత్రి హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ టి.వినోద్, రవీంద్ర విద్యా సంస్థల వైస్ ఛైర్మన్ జి.వంశీ బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కెవి.సుబ్బారెడ్డి విద్యా సంస్థల ఛైర్మన్ కెవి.సుబ్బారెడ్డి మాట్లాడారు. ఈ రోజు పిల్లలకు నిజమైన పండుగ రోజు అని తెలిపారు. డబ్బే పరమావధిగా పిల్లలను పెంచకుండా నిజమైన మనుషులుగా తయారు చేయాలని, అందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని తెలిపారు. సంపాదించడం, ఖర్చు పెట్టడం ధర్మంగానే ఉండాలన్నారు. మనిషి నైతిక విలువలు, దయ, ఉన్నత ఆలోచనలు కలిగి ఉండాలని, అప్పుడే ఉన్నతంగా ఎదుగుతారని తెలిపారు. భవిష్యత్తులోనూ ఇలాంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటామన్నారు. ప్రయివేట్ విద్యాసంస్థల సలహాదారులు పివిబి.సుబ్బయ్య మాట్లాడుతూ... తల్లిదండ్రులు మార్కుల కోసం ఒత్తిడి తీసుకురాకూడదని కోరారు. బాలోత్సవం నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. మాంటిస్సోరి ఇండస్ పాఠశాల ప్రిన్సిపల్ మీనాక్షి విల్సన్ మాట్లాడుతూ... విద్యార్థులను తీసుకొచ్చిన ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. బహుమతి వచ్చినా, రాకపోయినా బాలోత్సవంలో పాల్గొనడమే గొప్ప అవకాశమని తెలిపారు. కార్యక్రమంలో బాలోత్సవం కల్చరల్ కార్యదర్శి ఎంపి.బసవరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి కెంగార మోహన్, యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ టి.నరసింహా, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు యుఆర్ఎ.రవి కుమార్, సాహితీ స్రవంతి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల చక్రపాణి యాదవ్ పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న ముఖ్యఅతిథులు డాక్టర్ శంకర శర్మ, కెవి.సుబ్బారెడ్డి, సుబ్బయ్య, నరసింహా, మీనాక్షి విల్సన్



సభలో మాట్లాడుతున్న మీనాక్షి విల్సన్



నృత్యం చేస్తున్న చిన్నారులు

అక్రమ అరెస్టులపై నిరసన

- హెల్త్ సెంటర్ల వద్ద ఆశా వర్కర్ల యూనియన్ నిరసన

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఎపిఆశా వర్కర్ల యూనియన్ సిఐటియు నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 8న విజయవాడలో ధర్నాకు వెళ్లకుండా సచివాలయం వద్ద రైల్వే స్టేషన్లలో బస్సు స్టేషన్లలో బలవంతంగా అరెస్టు చేయటాన్ని నిరసనగా వీకర్ సెక్షన్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద, కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు గంటపాటు నిరసన తెలిపారు. గత సంవత్సర కాలంగా ఆశాలకు కనీస వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పనిభారం తగ్గించాలని గ్రాడ్యుటీ రూ.5 లక్షల రూపాయలు ఇవ్వాలని ఉచిత ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, శాంతియుత పద్ధతిలో నిరసన తెలిపే ఆశాలను అక్రమ అరెస్టు, నిర్బంధాలను ఖండించాలని నినాదాలు చేశారు. వీకర్‌సెక్షన్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద సిఐటియు జిల్లా కార్యదర్శి జె. నాగేశ్వరరావు ఆశ వర్కర్ల యూనియన్ నాయకులు ఈశ్వరి భాయ్ మాట్లాడుతూ విధుల్లో ఉన్న ఆశ వర్కర్లను సచివాలయ పోలీసులతో పోలీస్ స్టేషన్లకు రావాలని లేదంటే మీ ఇండ్ల వద్దకు వచ్చి అరెస్టు చేస్తామని బెదిరింపులు, అత్యుత్సాహంతో పోలీసుల ప్రవర్తనను ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం శాంతియుత చర్చల పేరుతో నాయకులను అరెస్టు చేయటం నీచమైన చర్యని ఇటువంటి చర్యలు మానుకోవాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే మరోసారి ఉద్యమబాట పట్టాల్సి ఉంటుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అర్బన్ పిహెచ్‌సి డాక్టర్ పాల్గొని సంఘీభావాన్ని తెలపారు. నిరసన కార్యక్రమంలో శాంతకుమారి భూదేవి పాపమ్మ అనురాగ్, జాకీర్ బేగం, సబితా కవిత, హేమలత, రబియా తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు ఆశాల నిరసన

కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు నిరసనలో సిఐటియు నాయకులు కె.సుధాకరప్ప, జి.ఏసు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ నిర్బంధాలు ఎదిరించి విజయవాడకు వేల సంఖ్యలో ఆశాలు తరలి వెళ్లారని, ప్రభుత్వం సమస్యలను పరిష్కరించేది పోయి మగ పోలీసుల ద్వారా ఆశా వర్కర్లను ఇష్టం వచ్చినట్లు ఈడ్చుకుంటూ మహిళలు అని చూడకుండా తాకరాని చోట తాకుతూ ఉండడం పట్ల పోలీసుల తీరును తీవ్రంగా వ్యతిరేకించారు. ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు పి.మహేశ్వరి, వి.అరుణ ,సుజాత, సుంకులమ్మ, సుకన్య, బి.జ్యోతి, హబీబున్నిసా, ఈశ్వరీ, శాంతమ్మ, ఇందిరా కస్తూరిబాయి హేమలత పాల్గొన్నారు.

అల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలి

- కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

విద్యార్థులందరూ తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన సూచించారు. శుక్రవారం కర్నూలు ఇందిరాగాంధీ మెమోరియల్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ అల్బెండజోల్ మాత్రల విద్యార్థులకు పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ... జాతీయనులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఆరు నెలలకోసారి 1సంవత్సరం నుంచి 19 సంవత్సరాలలోపు చిన్నారులకు, విద్యార్థులకు తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్రలను అందజేస్తామన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ పదవ తరగతి విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ మాత్రలను 19 యేళ్లలోపు వారందరికీ పంపిణీ చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్‌ఒ డాక్టర్ రామ గిడ్డయ్య, ఐసిడిఎస్ పిడి వెంకటలక్ష్మీ, డిఇఒ శ్యామ్యూల్, ఆర్‌బిఎస్‌కె కో-ఆర్డినేటర్ డాక్టర్ హేమలత, మెడికల్ ఆఫీసర్ మాధవి, డిప్యూటీ డెమో చంద్రశేఖర్, డిఐసి మేనేజర్ ఇర్ఫాన్ బాషా, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో మరో దారుణం

- పట్టపగలే వేట కొడవలితో యువకుడిపై దాడి
- కోర్టు గేటు బయట హత్యాయత్నం
- ప్రాణాపాయ స్థితిలో యువకుడు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరులో మరో దారుణం చోటు చేసుకుంది. వరుస హత్యాయత్నాలు, చోరీలతో పోలీసులకు సవాలుగా మారింది. శుక్రవారం పట్టణంలోని కోర్టు గేటు బయట యువకుడిపై ఓ వ్యక్తి వేట కొడవలితో దాడి చేసి హత్యకు ప్రయత్నించారు. ఎమ్మిగనూరు ప్రజలు ఉలిక్కి పడ్డారు. ఎమ్మిగనూరు కోర్టులో హాజరయి బయటికి వచ్చిన వీర నారాయణపై కురువ ఈరన్న వేట కొడవలితో దాడి చేశారు. కురువ వీర నారాయణ తల, మెడ భాగంలో గాయాలయ్యాయి. చేతి వేలు తెగిపోయింది. దాడి జరిగిన ప్రదేశంలో రక్తపు మడుగులో పడి ఉన్న వీర నారాయణను పోలీసులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వీర నారాయణను మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరి మధ్య ఉన్న ఆర్థిక లావాదేవీలే దాడికి కారణమని సమాచారం. కోడుమూరు నియోజకవర్గం సిబెళగల్ మండలం తూర్పు కంపాడు గ్రామానికి చెందిన కురువ సోమన్న కుమారుడు కురువ ఈరన్న, అనంతపురం జిల్లా కనగానపల్లి మండలం దదలురు గ్రామ బీసీ కాలనీకి చెందిన కురువ పెద్దన్న కుమారుడు కురువ బూటు వీర నారాయణలు అల్యూమినియం వ్యాపారం చేసే వారు. ఈరన్న సరుకు కోసం వీర నారాయణకు రూ.3 లక్షలు ఇచ్చినట్లు తెలిసింది. ఈరన్నకు వీర నారాయణ ఇవ్వాల్సిన డబ్బు ఇవ్వలేదు. వారి మధ్య ఘర్షణలు జరిగినట్లు సమాచారం. వీర నారాయణపై ఈరన్న చెక్ బౌన్స్ కేసును ఎమ్మిగనూరు జూనియర్ సివిల్ కోర్టులో 2023లో వేశారు. ఈ వ్యవహారంలో వీరి మధ్య మనస్పర్థలు తీవ్రమై హత్యాయత్నానికి దారి తీసింది. దాడికి పాల్పడిన ఈరన్న ఎమ్మిగనూరు పోలీసు స్టేషన్‌లో లొంగిపోయారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



దాడికి గురైన వ్యక్తి

'పది'లో ఉత్తమ ఫలితాలకు కృషి

- డిఇఒ శ్యామ్యూల్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఈ ఏడాది జరిగే టెన్త్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కషి చేస్తామని జిల్లా విద్యాశాఖ అధికారి కె.శ్యామ్యూల్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారిగా ఆయన బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజనను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో విద్యారంగ అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. డిఇఒను కలిసిన యుటిఎఫ్ నేతలు జిల్లా విద్యాశాఖ అధికారి స్వామియేలను యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె. సురేష్ కుమార్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవికుమార్ నవీన్ పాటి జిల్లా సహాధ్యక్షులు హేమంత్ కుమార్ కలిసి అభినందనలు తెలిపారు.



డిఇఒకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

నేడు పాఠశాలలు నిర్వహణ

జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలు రెండవ శనివారం అయినప్పటికీ తప్పనిసరిగా యధావిధిగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామ్యూల్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత సంక్రాంతి సెలవుల్లో భాగంగా పాఠశాలలను రెండవ శనివారం కూడా పని దినంగా నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఐఒ గురువయ్య శెట్టి

11 నుండి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఈనెల 11 నుండి ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమవుతాయని ఆర్ఐఒ ఎస్‌విఎస్ గురువయ్యశెట్టి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం ఆర్ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో మొదటి విడత ఈ నెల 11 నుంచి 16వ తేదీ వరకు 77 పరీక్ష కేంద్రాల్లో ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 16 నుండి 20 వరకు 38 పరీక్షా కేంద్రాల్లో జరుగుతాయన్నారు. ఈ ప్రాక్టికల్స్ పరీక్షలో 9750 మంది ఎంపిసి విద్యార్థులు, 4704 మంది బైపిసి విద్యార్థులు ప్రాక్టికల్స్ పరీక్షలకు హాజరవుతున్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో సిసి కెమెరాలును ఏర్పాటు చేసి ప్రాక్టికల్స్‌ను పర్యవేక్షిస్తామన్నారు. డిఇసి మెంబర్స్ పరమేశ్వర్ రెడ్డి, లాలప్ప, ప్రభు ఉన్నారు.

కరువు సహాయక చర్యలు చేపట్టాలి

12న తహశీల్దార్ కార్యాలయం ముందు ఎపిరైతు సంఘం ధర్నా

ప్రజాశక్తి-పత్తికొండ

కర్నూలు జిల్లా వ్యాప్తంగా కరువు సహాయక చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం పత్తికొండ ఈశ్వర్ రెడ్డి భవనంలో జిల్లా ఉపాధ్యక్షులు రంగారెడ్డి అధ్యక్షతన జిల్లా రైతు సంఘం కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి జిల్లా కార్యదర్శి రామకృష్ణ హాజరయి మాట్లాడారు. 2023వ సంవత్సరంలో ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితుల వల్ల రాష్ట్రంలోని 350 నుండి 400 మండలాల్లో తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. రాష్ట్రంలో సాధారణ సాగు 85 లక్ష ఎకరాలు కాగా, 26 లక్షల ఎకరాలలో విత్తనాలు కూడా పడలేదన్నారు. వేసిన పంటలు వర్షాభావం వల్ల 30 శాతందిగుబడి రానీ పరిస్థితి ఏర్పడిందన్నారు. కర్నూలు జిల్లాలోని 25 మండలాలు ఉంటే దాదాపు అన్ని మండలాల్లో వర్షాభావ పరిస్థితులు కారణంగా పంటలన్నీ దెబ్బతిన్నాయన్నారు. జిల్లాలో 22 మండలాలను రాష్ట్రంలో 110 మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. కర్నూలు, తుగ్గలి, క్రిష్ణగిరి మండలాలను కరువు మండలంగా ప్రకటించాలన్నారు. కరువు కారణంగా పంటలు నష్టపోయిన రైతులు అందరికీ ఎకరాకు రూ.పదివేల రూపాయలు ఇన్పుట్ సబ్సిడీ ఇవ్వాలని నష్టపోయిన పంటకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట బీమా పరిహారం ఎకరాకు రూ.20వేల నుండి రూ.50 వేల వరకు ఇవ్వాలని డిమాండ్ చేశారు, వలసల నివారణకు ఉపాధి పనులు కుటుంబానికి 200 రోజులు పని కల్పించాలని,డిమాండ్ చేశారు. రైతులకు రెండు లక్షల వరకు రుణమాఫీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 12న మండల, రెవిన్యూ డివిజన్ కేంద్రాలలో, వ్యవసాయ శాఖ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్నామని, పెద్ద ఎత్తున రైతులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు హనుమంతు, రంగారెడ్డి, సి.హనుమంతు, పి.హనుమంతు, సహాయ కార్యదర్శి సూరి, మండల కార్యదర్శి సిద్ధయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ



సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సృజన, ఎమ్మెల్యే చెక్కకేశవరెడ్డి

15న సిఎం జగన్ రాక

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఈనెల 15న కర్నూలు నగరానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రానున్నారు. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి కుమారుడు వివాహానికి కర్నూలు నగర శివారులోని కింగ్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్ లో జరిగే వివాహ వేడుకల్లో సిఎం పాల్గొంటారు. ఈ మేరకు సిఎం పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ జి.సృజన జిల్లా ఎస్పి కృష్ణ కాంత్ పరిశీలించారు. సిఎం పర్యటన బందోబస్తు ఏర్పాట్లు పక్కాగా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

పివికి భారత రత్న ఇవ్వడం పట్ల బ్రాహ్మణ సంఘం హర్షం

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

యావత్ భారతదేశం గర్వించదగ్గ మహానాయకుడు, తెలుగుజాతి ఆణిముత్యం బహుభాషా కోవిదుడు, భారత ఆర్థిక సంస్కరణల పితామహుడు మాజీ ప్రధానమంత్రి పాములపర్తి నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారాన్ని ప్రకటించటం అత్యంత ఆనందదాయకమని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకట రామరాజు శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వెలిబుచ్చారు. ఈ సందర్భంగా ఆయన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పివినరసింహారావుకు ఇలాంటి గౌరవం ఎప్పుడో దక్కాల్సిందని అన్నారు.



దళితుల భూమిని ఇతరులకు ఇస్తే ఎలా?

వైసిపి నాయకుల తీరుపై ఎంఆర్‌పిఎస్ మండిపాటు

ప్రజాశక్తి-మద్దికేర

దళితుల ప్రయోజనం కోసం 2008 సంవత్సరంలో కొనుగోలు చేసిన భూములను వైసిపి నేతలు ఇతరులకు ఇల్లు పట్టాలు ఇస్తామంటే ఎలా అంటూ ఎపి ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు పారా రాఘవేంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం దళితుల కోసం కొనుగోలు చేసిన భూములను దళితులకే పంచాలంటూ ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం మద్దికేరలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. రాఘవేంద్ర మాట్లాడుతూ వైసిపి నాయకులు కులాల మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. దళితుల కోసం కొనుగోలు చేసిన భూమిని బిసి, ఒసిలకు ఇల్లు పట్టాలు ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. నాలుగు ఎకరాల భూమి రోడ్డుకు దగ్గరలో ఉన్నందున వైసిపి నాయకులు కాజేసేందుకే ఈ ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డౌన్ డౌన్ జడ్‌పిటిసి మురళీధర్ రెడ్డి డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. స్థానిక అగ్రకుల నాయకులు దళితుల భూమిపై కన్ను వేయడం వల్లే ఈ సంఘటనలు చోటు చేసుకున్నాయని అన్నారు. ఎస్‌సి కార్పొరేషన్ నిధులతో ఎస్‌సిలకు కొనుగోలు చేసిన భూమిని వారికే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దళితులకు ఇంటిపట్టాలు ఇవ్వకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. పారా సంజీవ రాయుడు, బొజ్జన్న, ఉలిగప్ప, శివప్రసాద్, గణేష్ చంద్ర, మహిళలు పాల్గొన్నారు.



ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో నిరసన



మాట్లాడుతున్న బిఎస్ఎన్ఎల్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్.రామరాజు

బిఎస్ఎన్ఎల్ కు 4జి, 5జి సేవలను అమలు చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

బిఎస్ఎన్ఎల్ మనుగడ సాగించి లాభాల బాటలో ఉండాలంటే ప్రభుత్వం 4 జి, 5 జి సేవలో అమలు చేయాలని బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్.రామరాజు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం కర్నూలు బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో ఈనెల 16న జరుగు దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2017 జనవరి ఒకటి నుంచి టెలివిజన్, పెన్షన్ డివిజన్‌లు చేసి నాలుగు కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడం ఆపాలన్నారు. కనీస వేతనము రూ.26,000 ఇచ్చి క్యాజువల్ లేబర్ కు పేరివిజన్ ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో బిఎస్ఎన్ఎల్ గౌరవ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, కమిటీ సభ్యులు ఉద్యోగులు పాల్గొన్నారు.

భారత న్యాయ సంహిత 2023 చట్టాన్ని రద్దు చేయాలి

16న రవాణా టైర్‌బందును జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త రవాణా టైర్ బంద్ సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు కోరారు. శుక్రవారం కర్నూలు న్యూసిటీ ఆటోయూనియన్ నగర కమిటీ సమావేశం కెకె భవన్‌లో ఎస్.మాలిక్‌బాష అధ్యక్షతన నిర్వహించారు. ఎండి.అంజిబాబు, సిఐటియు నగర అధ్యక్షులు ఆర్.నరసింహులు, ఆటో యూనియన్ నగర కార్యదర్శి బి.రాధాకృష్ణ లు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలకు డ్రైవర్లను బాధ్యులను చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న డ్రైవర్ల మెడకు ఉరితాడు లాంటి భారత న్యాయ సంహిత 2023 హిట్ అండ్ రన్ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ చట్టంలోని సెక్షన్ 106/1ప్రకారం ప్రమాదానికి కారణం అయినడ్రైవర్ కుపదేళ్లజైలుశిక్ష, రూ.7లక్షలజరిమానా, ప్రమాదం జరిగిన ప్రాంతం నుంచి డ్రైవర్ పారిపోతే హిట్ అండ్ రన్ సెక్షన్ 106/2 ప్రకారం పదేళ్ల జైలు, రూ.10 లక్షల జరిమానా విధింపును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. అనుకోకుండా జరిగే ప్రమాదాలకు అనేక రకాల కారణాలు ఉంటాయని, వాటికి డ్రైవర్లను బాధ్యులను చేయడం సరైంది కాదన్నారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలోనే డ్రైవర్ ఉండాలంటే అతనిప్రాణాలకు రక్షణ ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. రవాణా రంగంలో పనిచేసే కార్మికుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా వివక్షచూపుతున్నా యన్నారు. ఈనెల 16న జరిగే భారతదేశ వ్యాపిత టైర్ బందు కార్యక్రమాన్ని ఆటో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆటో యూనియన్ నాయకులు ఎన్.శివకృష్ణ, సురేష్, మున్నా, రమేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎండి అంజిబాబు

సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకం

- సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - ఆదోని

ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకమైందని ఆదోని ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ తెలిపారు. శుక్రవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ఎన్నికల విధులపై సెక్టోరల్ అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదోని నియోజకవర్గంలో 256 పోలింగ్ కేంద్రాలకు గాను 25 మంది సెక్టోరల్ ఆఫీసర్లు, ఇద్దరు రిజర్వ్ కలిపి 27 మంది సెక్టోరల్ ఆఫీసర్లను నియమించినట్లు తెలిపారు. సెక్టోరల్ అధికారులు ఎన్నికల ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. శిక్షణ సామగ్రి, చేయాల్సిన, చేయకూడని, చెక్ లిస్ట్, హ్యాండ్ బుక్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. సెక్టోరల్ అధికారులు తమ పరిధిలోని ప్రతి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించాలని, పోలింగ్ కేంద్రాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు, పోలింగ్ సిబ్బందికి వసతుల విషయమై లోటుపాట్లు ఉంటే వెంటనే తమ దృష్టికి తెచ్చి, వసతుల కల్పన పూర్తి చేయాలన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని సూచించారు. తహశీల్దార్, ఎఈఆర్ఓ హసీనా సుల్తానా, డిఎల్‌పిఒ నూర్జహాన్, కార్యాలయ పరిపాలన అధికారి, ఎఈఆర్ఓ వీరభద్రప్ప, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ ఎజాజ్ అహ్మద్ పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** పట్టణంలోని మండల పరిషత్ సమావేశ భవనంలో తహశీల్దార్ పి.శేషారెడ్డి, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ గురురాజా రావు ఆధ్వర్యంలో ఎన్నికల విధులపై సెక్టోరల్ అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. జడ్‌పి సిఇఒ, ఎమ్మిగనూరు నియోజకవర్గ ఏఈఆర్ఓ నాసర రెడ్డి మాట్లాడారు. సెక్టోరల్ అధికారులు ఎన్నికల ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. మున్సిపల్ డిఇ మనోహర్ రెడ్డి, హౌసింగ్ ఎఇ ప్రసాద్ పాల్గొన్నారు.

ఆశాలపై నిర్బంధాన్ని ఆపాలి

- అక్రమ అరెస్టులతో పోరాటాన్ని ఆపలేరు
- ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు శివలక్ష్మి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఆశావర్కర్లపై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిర్బంధాన్ని ఆపాలని ఎపి ఆశావర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షులు బి.శివలక్ష్మి, నాయకులు బి.లింగమ్మ, కృష్ణవేణి డిమాండ్ చేశారు. ఆశావర్కర్లను అక్రమంగా అరెస్టు చేయడాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం స్థానిక సోమప్ప సర్కిల్‌లో ధర్నా చేపట్టారు. అనంతరం తహశీల్దార్ శేషారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తమ డిమాండ్ల పరిష్కారానికి ఈనెల 8న చేపట్టిన 'చలో విజయవాడ'ను ప్రభుత్వం అడ్డుకుని అరెస్టు చేయడం దారుణమని విమర్శించారు. ప్రభుత్వం భయపడి తమను ఎక్కడికక్కడే అరెస్టు చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తోందని మండిపడ్డారు. కనీస వేతనం రూ.26 వేలు ఇచ్చి గ్రాట్యుటీ, పింఛను ఇవ్వాలని కోరారు. జీవిత బీమా రూ.10 లక్షలు ఇవ్వడంతో పాటు మరణించిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. అర్హులైన ఆశాలను ఎఎన్ఎంగా గుర్తించాలని తెలిపారు. పోలీసుల వేధింపులు ఆపాలని, లేకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, బోయ రాముడు, ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు కృష్ణవేణి, విశాలాక్షి, అన్వేసరి, వీరేశమ్మ, పరమాన్‌దొడ్డి గొల్ల రంగలక్ష్మి, షబానా, రేష్మా, నరసమ్మ, సరస్వతి, లింగమ్మ, మంజుల, భాగ్య లక్ష్మి, శోభ, గంగమ్మ, జయమ్మ, మహాలక్ష్మి, నాగలక్ష్మి పాల్గొన్నారు. **గోనెగండ్లలో** ఆశావర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ సర్కిల్ నుంచి ర్యాలీ నిర్వహించారు. ఆశాలందరూ విధులు బహిష్కరించి ఆస్పత్రి ఎదుట నిరసన తెలిపి వైద్యులు రజనీకి వినతిపత్రం అందజేశారు. ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి. శివలక్ష్మి, నాయకులు మైమూన్, అమీనా, సుజాత, లక్ష్మి, రంగమ్మ, జానకి, బేబీ, యశోద, భారతి, బేగం, సావిత్రి, మహబూబ్‌బీతో పాటు 40 మంది పాల్గొన్నారు. **ఆదోని**లోని శ్రీనివాస్ భవన్ సర్కిల్ వద్ద రాస్తారోకో చేపట్టారు. యూనియన్ పట్టణ కార్యదర్శి గోపాల్ అధ్యక్షతన నిరసన చేపట్టారు. మండల కార్యదర్శి వీరారెడ్డి, నాయకులు మల్లికార్జున, నాగరాజు హాజరయ్యారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న, సీనియర్ నాయకులు మహానంది రెడ్డి మాట్లాడారు. ఆశావర్కర్స్ యూనియన్ పట్టణ, మండల నాయకులు చిట్టెమ్మ, ఇందిరమ్మ, జయలక్ష్మి, రాజేశ్వరి, సరోజ, నాగలక్ష్మి పాల్గొన్నారు. **హాలహర్వి**లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశావర్కర్లు నిరసన చేపట్టారు. సిఐటియు మండల కార్యదర్శి కృష్ణ అధ్యక్షత వహించారు. ఆశావర్కర్స్ యూనియన్ మండల నాయకులు విజయ లక్ష్మి, భారతి, సునీత, శివమ్మ, సిఐటియు నాయకులు విఠల్ పాల్గొన్నారు. **మంత్రాలయం** తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ శ్రీధర్ మూర్తికి వినతిపత్రం అందజేశారు. అనంతరం రాఘవేంద్ర సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి నిరసన చేపట్టారు. సిఐటియు మండల కార్యదర్శి హెచ్.జయరాజు, సిఐటియు నాయకులు అంజి, జకరయ్య, ఆశావర్కర్స్ యూనియన్ అధ్యక్షులు రాధమ్మ, కార్యదర్శి పుష్ప, ఆశాలు కె.రాజేశ్వరి, కె.రంగమ్మ, సి.సలోమి, సుజాత, ప్రవీణ, పి.పద్మ, సి.ఈరమ్మ పాల్గొన్నారు. **చిప్పగిరి** ప్రభుత్వాస్పత్రి ఆవరణలో నిరసన చేపట్టారు. సిఐటియు డివిజన్ నాయకులు కెపి.నారాయణస్వామి, ఆశా కార్యకర్తలు మాధవి, రాధమ్మ, కవిత, లక్ష్మి, సుజాత, ఈరమ్మ పాల్గొన్నారు. **ఆస్పరి** ప్రభుత్వాస్పత్రిలో ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు దస్తగిరమ్మ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సిఐటియు మండల కార్యదర్శి రామాంజినేయులు, బాలకృష్ణ, ఆశావర్కర్లు లక్ష్మి, రాజేశ్వరి, భువనేశ్వరి, శారద, మహేశ్వరి పాల్గొన్నారు. **పెద్దకడబూరు**లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట నిరసన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సిఐటియు గౌరవాధ్యక్షులు తిక్కన్న, రైతు సంఘం జిల్లా నాయకులు పరమేష్, ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు ఇందిరమ్మ, ఆశాలు జయలక్ష్మి, ప్రభావతి పాల్గొన్నారు. **కౌతాళంలో** సిఐటియు ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. సిఐటియు కార్యాలయం నుంచి ర్యాలీగా బయల్దేరి అంబేద్కర్ సర్కిల్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.మల్లయ్య, విజయలక్ష్మి, ఆశాలు సుజాత, తాయమ్మ, లక్ష్మి, చాంద్‌బీ, కృష్ణవేణి, ఈరమ్మ, నాగవేణి, రత్నమ్మ, సంగీత పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో నిరసన తెలియజేస్తున్న ఆశాలు, నాయకులు



ఆదోనిలో రాస్తారోకో చేపడుతున్న ఆశా వర్కర్లు

రాఘవేంద్రుని దర్శించుకున్న తిక్కారెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం



ఆలయంలో ఉన్న తిక్కారెడ్డి

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన శ్రీరాఘవేంద్రస్వామిని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి దర్శించుకున్నారు. శుక్రవారం అమావాస్య తిథి సందర్భంగా శ్రీమఠం చేరుకున్న ఆయనకు శ్రీమఠం సహాయక పిఆర్ఒ హొన్నొళ్లి వ్యాసరాజాచార్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రుని మూల బృందావనాన్ని దర్శించుకున్నారు. అనంతరం శ్రీమఠంలో నిర్వహించిన స్వర్ణ పల్లకోత్సవంలో పాల్గొని పల్లకి మోశారు. శ్రీమఠం ఆధ్వర్యంలో జరగనున్న అభివృద్ధి పనులకు సంబంధించిన చాయా చిత్రాన్ని పీఠాధిపతులు శ్రీసుభుదేంద్ర తీర్థులు ఆయనకు చూపిస్తూ వివరించారు. టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేశప్ప స్వామి, పూజారి వ్యాసరాజాచార్, తెలుగు రైతు జిల్లా కార్యదర్శులు బూదూరు మల్లికార్జున రెడ్డి, ఎల్లారెడ్డి, తెలుగు యువత జిల్లా మీడియా కోఆర్డినేటర్ విజయ రామిరెడ్డి, నాయకులు వగరూరు అబ్దుల్, పవన్ కుమార్ రెడ్డి, చిలకలడోన మాజీ సర్పంచి హనుమంతు, తిక్కయ్య, వగరూరు గోపాల్ ఉన్నారు.

పంట నష్టపరిహారమందించాలి

- వ్యవసాయ సలహా సంఘం మండల చైర్మన్ హంపిరెడ్డి

ప్రజాశక్తి- దేవనకొండ

ఖరీఫ్ సీజన్‌లో పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ పరిహారాన్ని రైతుల ఖాతాకు త్వరగా జమ చేయాలని వ్యవసాయ సలహా సంఘం మండల కమిటీ చైర్మన్ హంపి రెడ్డి కోరారు. శుక్రవారం స్థానిక మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో వ్యవసాయ సలహా సంఘం కమిటీ సభ్యులతో ఎఒ సురేష్ బాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో నష్టపోయిన రైతులకు ఉచిత పంటల బీమా కింద అన్ని పంటలకూ బీమా డబ్బులు జమ చేయాలని కోరారు. ప్రస్తుత ఈ సీజన్‌లో పంటలు వేసిన రైతులు ఆర్‌బికెలలో ఈకేవైసీ చేయించుకోవాలని తెలిపారు. సభ్యులు రంగన్న, ఎఇఒలు యోగేంద్ర, రంగన్న, జయరామ్, విఎఎలు సలీం, మునిస్వామి, అబ్దుల్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలపై ఆరా

ప్రజాశక్తి - మంత్రాలయం

రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తహశీల్దార్ శ్రీధర్ మూర్తి మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలపై ఆరా తీశారు. శుక్రవారం మంత్రాలయం, చెట్నిహల్లి, కలుదేవకుంట, చిలుకలడోన గ్రామాల్లోని సుమారు 16 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా చిలుకలడోన గ్రామంలో మరుగుదొడ్లు ఉన్నప్పటికీ నీటి కొరత ఉందని చెప్పడంతో డ్రమ్ములు ఏర్పాటు చేయాలని సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని 57 పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్ల ఏర్పాటు, ర్యాంపుల ఏర్పాటును కాంట్రాక్టు ఇవ్వగా కాంట్రాక్టర్ మహేష్‌ను ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద అధికారులకు, ఓటర్లకు ఎలాంటి అసౌకర్యమూ కలుగకుండా చూడాలని సూచించారు. ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ శశిశేఖర్ ఉన్నారు.

16న గ్రామీణ బంద్‌కు మద్దతు

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వెంకటేశులు

ప్రజాశక్తి - ఆదోనిరూరల్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ విధానాలకు నిరసనగా సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపుమేరకు ఈనెల 16న జరిగే గ్రామీణ బంద్‌కు సిపిఎం సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు, మండల కార్యదర్శి కె.లింగన్న తెలిపారు. శుక్రవారం మండల కమిటీ సమావేశం మండల నాయకులు బాష అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈనెల 1న ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సామాన్యులకు తీవ్ర అన్యాయం జరిగిందని తెలిపారు. బిజెపి పేదలకు చేస్తున్న ద్రోహానికి వ్యతిరేకంగా, రైతులకు గిట్టుబాటు ధరకు చట్టబద్ధత కల్పించాలని కోరారు. రైతు రుణాలు మాఫీ చేయాలని, ఎరువులు, పురుగు మందుల ధరలు తగ్గించాలని, వ్యవసాయ కూలీలకు ఉపాధి పనులు 200 రోజులు పెంచాలని డిమాండ్ చేశారు. రూ.600 వేతనం కల్పించాలని, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, స్కీమ్ వర్కర్లకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని కోరారు. నిత్యావసర వస్తువుల ధరలు నిరుపేదలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామీణ బంద్‌లో రైతులు, కూలీలు, కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సిపిఎం మండల కార్యదర్శి వర్గసభ్యులు ఉచ్చీరప్ప పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు



ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయిస్తున్న పోలీసులు

గొర్రెల కాపరుల మధ్య ఘర్షణ

- కేసు నమోదు

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని ఐరన్‌బండ పంచాయతీ మజరా గ్రామం ఎన్నేకండ్ల గ్రామంలో గొర్రెల మేత విషయంలో గొర్రెల కాపరుల మధ్య శుక్రవారం ఘర్షణ చోటు చేసుకుంది. ఎన్నేకండ్ల గ్రామంలో గొర్రెలను మేపేందుకు పొలాల్లో వదిలే విషయంలో గొర్రెల కాపరులు రామాంజిని, ఉలిగప్ప కుటుంబాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. దీనిపై గోనెగండ్ల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన రామాంజినిపై గోనెగండ్లలోని బస్టాండ్ వద్ద ఉలిగప్ప, బాలు దాడి చేయడంతో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఇరు వర్గాల వారు పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించారు. గాయపడిన వారికి పోలీసులు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించారు. ఘటనపై గోనెగండ్ల సిఐ రామకృష్ణయ్య, ఎన్నేకండ్ల గ్రామానికి వెళ్లి వివరాలు సేకరించి, రామాంజిని ఫిర్యాదు మేరకు ఉలిగప్ప, బాలుపై కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

కన్నడ భాషను ఆదరించాలి

- మున్సిపల్ చైర్మన్ శాంత

ప్రజాశక్తి - ఆదోని

కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన ఆదోని డివిజన్‌లోని కన్నడ భాష మాట్లాడే వారి సంఖ్య అధికంగానే ఉందని, కన్నడను ఆదరించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని మున్సిపల్ చైర్మన్ శాంత తెలిపారు. శుక్రవారం వీరశైవ కల్యాణ మండపంలో విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కన్నడ భాషలో విద్యాభ్యాసం చేస్తూ 10వ తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు నగదుతో ప్రోత్సహించడం అభినందనీయమని తెలిపారు. కన్నడ ప్రాధికార అభివృద్ధి సంస్థ రూ.12 వేలు, రూ.11 వేలు, రూ.10 వేల చొప్పున ఆర్థిక ప్రోత్సాహాన్ని అందించేందుకు ముందుకు రావడం హర్షణీయమని చెప్పారు. కల్లుమఠం పీఠాధిపతి గురు సిద్ధ స్వామి, ప్రజావాణి దినపత్రిక సంపాదకులు రవీంద్ర మాట్లాడారు. కన్నడ భాషను ప్రోత్సహించే దిశగా కర్ణాటక ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. 52 మంది విద్యార్థులకు సుమారు రూ.5 లక్షల నగదు ప్రోత్సాహం అందిస్తున్నామని చెప్పారు. రామలింగప్ప, శరణబసప్ప, కృష్ణమూర్తి గౌడ్, దేశాయి చంద్రన్న, శ్రీరాములు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

పురస్కారాలు అందజేస్తున్న చైర్మన్ శాంత



టిడిపి టికెట్ నాకే...

- టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

'టిడిపి అంటే ఎనలేని పిచ్చి. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అంటే ప్రాణం. పార్టీ కోసం నా ప్రాణాలైనా వదులుతాను. పార్టీయే నాకు సర్వస్వం. రానున్న టిడిపి టికెట్ నాకే వస్తుంది' అని మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు తెలిపారు. శుక్రవారం ఆదోనిలోని జెబి గార్డెన్స్‌లో 'జయహో బీసీ' నిర్వహించారు. ముందుగా ఆర్ట్స్ కళాశాల నుంచి గార్డెన్ వరకు వందలాది మందితో మీనాక్షి నాయుడు పాదయాత్ర నిర్వహించారు. ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మీనాక్షి నాయుడు మాట్లాడారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా కొనసాగి తామేమీ సంపాదించుకోలేదని, తనకు సంపాదనంతా పార్టీ కార్యకర్తలేనని తెలిపారు. 42 ఏళ్లుగా తన కుటుంబంగా ఉన్న కార్యకర్తల సహకారాన్ని ఎప్పటికీ మరువనని పేర్కొంటూ కన్నీటి పర్యంతమయ్యారు. ఆదోనిలో తన కమ్మ సామాజిక వర్గం ఓట్లు వేయి కూడా లేవని, తనను, తన కుటుంబాన్ని టిడిపి కుటుంబ సభ్యులు ఎంతగానో ఆదరిస్తున్నారని తెలిపారు. తనకు టిడిపినే ఒక పెద్ద కుటుంబమని చెప్పారు. ఎవరెన్ని చెప్పినా పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు మాత్రం 'ఆదోని నుంచి సింగిల్ నేమ్ అదే.. మీనాక్షి' అని ఎప్పుడో చెప్పారని, తాను ఇంతకాలం చెప్పలేదని తెలిపారు. తాను ఇప్పుడు చెప్పాల్సిన సమయం వచ్చిందని, కార్యకర్తలతో చెప్పకపోతే ఇక ఎవరితో చెప్పుకుంటానని పేర్కొన్నారు. తన ఆర్థిక పరిస్థితి ఏమిటో అందరికీ తెలుసని, తాను సంపాదించుకుంది అందరి ప్రేమ, విశ్వాసం, మనస్సేనని తెలిపారు. తనపై ఎంతో ప్రేమ, అభిమానం చూపిస్తున్న కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. మీనాక్షి నాయుడు కన్నీరు పెట్టుకోవడంతో కార్యక్రమానికి హాజరైన అనేక మంది కార్యకర్తలు, సానుభూతిపరులు సైతం కన్నీరు పెట్టారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి విజయం సాధించడం ఖాయమని తెలిపారు. తాను ఇంతకాలం ఎంతోమందిని తన వంతుగా రాజకీయంగా అభివృద్ధిలోకి తెచ్చానని, కీర్తిశేషులు దాసప్పనాయుడును ఎంపిపిగా, జడ్‌పిటిసిగా, మార్కెట్ యార్డు చైర్మన్‌గా రెండుసార్లు ఎంపిక చేశారని తెలిపారు. మల్లయ్యను ఒకసారి మున్సిపల్ చైర్మన్‌గా, ఒకసారి మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ఎంపిక చేశామని చెప్పారు. కౌతాళం మండలంలో అందరిని ఎదిరించి బీసీ నాయకులు చందాఖాన్, ఉల్లిగయ్యను ఎంపిపిగా, దేవేంద్రప్పను మార్కెట్ యార్డు చైర్మన్‌గా, అతని భార్యను జడ్‌పిటిసిగా, అలాగే అనేకమంది బీసీలకు రాజకీయ పదవులు తనవంతుగా కల్పించానని తెలిపారు. టిడిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ బిటి.నాయుడు సైతం తన శిష్యుడని, తాను చెప్పుకోవడం లేదని, ఈ విషయం ప్రతి సమావేశంలో బిటి.నాయుడు చెబుతున్నారని అన్నారు. తనకెంతో గర్వంగా ఉందన్నారు. బీసీ జిల్లా సెల్ అధ్యక్షులు సత్రం రామకృష్ణ, తెలుగు విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి తిమ్మప్ప, కౌన్సిలర్ పార్వతి, పాడేగల్లు అయ్యన్న, బసవరాజు, ప్రతాప్, గోనబావి గోపాల్, మారుతి రావు, రంగస్వామి మాట్లాడారు. జడ్‌పి మాజీ చైర్మన్ బత్తిని వెంకటరాముడు, పట్టణ అధ్యక్షులు గుంటెప్ప, నాయకులు బత్తిని కుబేర్‌నాథ్ పాల్గొన్నారు.



'జయహో బీసీ'లో మాట్లాడుతున్న మీనాక్షి నాయుడు

కాంగ్రెస్ ఇన్‌ఛార్జీనని చెప్పుకోవడం విడ్డూరం

- కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఆనందరాజు

ప్రజాశక్తి - పెద్దకడబూరు

రెడ్డి గోవర్ధన్ రెడ్డి అనే వ్యక్తి కాంగ్రెస్ మంత్రాలయం నియోజకవర్గం ఇన్‌ఛార్జీనని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఆనందరాజు, నాయకులు నాగరాజు, జోసెఫ్, మల్లేష్ తెలిపారు. శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కంబదహాళ్ గ్రామానికి చెందిన గోవర్ధన్ రెడ్డి అనే వ్యక్తి ఎలాంటి ఆదేశాలూ లేకున్నా నియోజకవర్గ ఇన్‌ఛార్జీనని, తనే ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నట్లు ప్రకటించుకోవడం సరైనది కాదని తెలిపారు. అతను ఎక్కడా పార్టీ అభివృద్ధి కోసం పని చేసిన దాఖలాలు లేవని విమర్శించారు. ఇలాంటి అసత్య ప్రచారాలు చేసుకుంటే మంచిది కాదని సూచించారు. కాంగ్రెస్ నాయకులు పరమేష్, రాజు పాల్గొన్నారు.

తహశీల్దార్‌ను కలిసిన దళిత నాయకులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

దళిత నాయకులు ఆర్.దేవి ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహశీల్దార్ హసీనా సుల్తాన్‌ను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా దళిత గిరిజన నాయకులు అడ్వయిజర్ చంద్రయ్య, జైభీమ్ సాయిరామ్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రవికుమార్ మాట్లాడారు. దళితులపై జరుగుతున్న దాడులు, దళితులకు సంబంధించిన భూ తగాదాలు, భూమికి సంబంధించిన ఆర్ఒఆర్, అడంగల్, పాస్ పుస్తకాలు త్వరగా ఇచ్చే ఏర్పాట్లు చేయాలని కోరారు. ఆయా గ్రామాల్లో సంబంధిత అధికారులకు చెప్పి పని చేయించాలని తెలిపారు. అలాగే కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను త్వరగా చేయాలని కోరారు. దళితులపై దృష్టి ఉంచాలని తెలిపారు. రెడ్డి, నకులరాజు, మల్లేష్, ఎల్లప్ప, వీరేష్, రాము, నాగరాజు పాల్గొన్నారు.

పివికి భారతరత్న ఇవ్వడం సంతోషకరం : మధుసూదన శర్మ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పివి.నరసింహారావుకు భారతదేశం అత్యున్నత పురస్కారం భారతరత్న ఇవ్వడం సంతోషంగా ఉందని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెల్లాల మధుసూదనశర్మ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. దేశాభివృద్ధిలో పివి.నరసింహారావు పాత్ర చాలా కీలకమైందని తెలిపారు. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ప్రధానమంత్రి పదవిని చేపట్టి ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చి ప్రపంచమంతా భారతదేశం వైపు చూసేలా చేశారని చెప్పారు. వివిధ దేశాలు ఆర్థిక పెట్టుబడులు పెట్టేందుకు అనుకూలమైన దేశంగా దేశానికి గుర్తింపు తీసుకొచ్చారని తెలిపారు. అలాంటి మహోన్నత వ్యక్తికి భారతరత్న ఇచ్చిన కేంద్ర ప్రభుత్వానికి, ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి కృతజ్ఞతలు తెలిపారు.

ఆకాశాన్నంటిన నిత్యావసర సరకుల ధరలు

- టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మాన్వి దేవేంద్రప్ప

ప్రజాశక్తి - ఆదోని

ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో నిత్యావసర సరకుల ధరలు ఆకాశన్నంటాయని, అదుపు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం చెందిందని టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మాన్వి దేవేంద్రప్ప విమర్శించారు. శుక్రవారం ఆదోనిలోని సిటీ ప్రెస్ టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడి ఐదేళ్లు పూర్తవుతున్నా ఇచ్చిన హామీలు పూర్తిగా నెరవేర్చలేకపోయిందని విమర్శించారు. రాష్ట్రాన్ని సుమారు రూ.10 లక్షల కోట్ల అప్పులో ముంచిందన్నారు. టిడిపి ప్రభుత్వంలో 'అన్న క్యాంటీన్' ద్వారా పేదలకు కడుపునిండా అన్నం పెట్టేదన్నారు. పేదల కోసం చంద్రన్న బీమా ఎంతో ఉపయోగకరంగా ఉండేదని తెలిపారు. నేడు దాన్ని నీరుగార్చి వైఎస్ఆర్ బీమా కింద కుటుంబంలో కేవలం ఒకరికి మాత్రమే వర్తించే విధంగా చేసిన పాపం వైసిపికే దక్కుతుందన్నారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో రోడ్లు అధ్వానంగా మారాయన్నారు. రాయలసీమ ప్రాంత ప్రజలు కరువుతో అల్లాడుతుంటే రెండుసార్లు రాయలసీమలో పర్యటించినా ప్రజలను పలకరించిన పాపాన పోలేదన్నారు. ఆదోని నియోజకవర్గంలో భారీగా తాగునీటి సమస్య ఉందని, ప్రజలు రోడ్లపైకి ఎక్కి ధర్నాలు చేస్తుంటే ఏ ఒక్కరోజు కూడా ప్రజల సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. టిడిపి ప్రభుత్వంలో నిరుద్యోగులకు భృతి ఇచ్చిన ఘనత చంద్రబాబుదని తెలిపారు. వైసిపి ప్రభుత్వంలో నిరుద్యోగులను పట్టించుకున్న దాఖలాలు లేవని, నిరుద్యోగులకు జగన్మోహన్ రెడ్డి ఇచ్చింది ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలో సంపూర్ణ మద్యపాన నిషేధం చేస్తానని గద్దెనెక్కిన జగన్మోహన్ రెడ్డి నేడు దానినే ఆదాయ వనరుగా మార్చుకున్నారని విమర్శించారు. టిడిపి హయాంలో ప్రతి పండగకూ కానుకలు ఇచ్చే వారని, వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పేదలు ప్రతిపండగకు పస్తులు ఉంటున్నారని తెలిపారు. టిడిపి ప్రభుత్వంలో పెళ్లి కానుక కింద బీసీలకు రూ.60 వేలు, ఎస్సీలకు రూ.75 వేలు, కులాంతర వివాహాలకు రూ.లక్ష, వికలాంగులకు రూ.లక్ష నగదును నేరుగా వారి ఖాతాలోకి ఇచ్చే వారని, నేడు వాటన్నింటినీ నీరుగార్చారని విమర్శించారు. టిడిపి హయాంలో గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ బిల్లు కేవలం రూ.200 వరకు వచ్చేదని, నేడు రూ.500 నుంచి రూ.1000 విద్యుత్ బిల్లు వస్తోందని తెలిపారు. టిడిపి కార్యకర్తలు సోమశేఖర్ రెడ్డి, రామకృష్ణ, రమేష్, అంజి, గోవిందు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాన్వి దేవేంద్రప్ప

చంద్రబాబుతోనే యువత భవిష్యత్తు

- తెలుగు యువత మండల అధ్యక్షులు రంగస్వామి నాయుడు

ప్రజాశక్తి - గోనెగండ్ల

రాష్ట్రంలోని యువత భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలంటే మళ్లీ చంద్రబాబునాయుడే ముఖ్యమంత్రి కావాలని తెలుగు యువత మండల అధ్యక్షులు రంగస్వామి నాయుడు, ముల్లా బాషా, జయపాల్, లక్ష్మీకాంత్, పోలకల్ వెంకటేశ్వర్లు, హరికృష్ణ, అబూబకర్ తెలిపారు. శుక్రవారం గోనెగండ్లలో టిడిపి రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు 'మై ఫస్ట్ ఓట్ ఫర్ సిబిఎన్' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఓటరు జాబితాలో కొత్తగా నమోదు చేసుకున్న యువ ఓటర్లను కలిసినట్లు తెలిపారు. వైసిపి ప్రభుత్వ అరాచకాలు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించినట్లు చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగాలు, ఉపాధి కోసం నిరుద్యోగులంతా ఎదురుచూసిన తరుణంలో ప్రభుత్వం చేస్తున్న నయవంచనను వివరించి, వచ్చే ఎన్నికల్లో టిడిపికి మద్దతు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. మునిస్వామి, వినోద్, గోవర్ధన్ నాయుడు, రామకృష్ణ, నీలకంఠ, దస్తగిరి, సూర్యనారాయణ రెడ్డి, గిడ్డయ్య, శ్రీకాంత్, ఖాజా, అనూక్, అబ్దుల్ పాల్గొన్నారు.

సమయపాలన పాటించని 'ఉద్యోగులు'

- సిపిఎం మండల కార్యదర్శి షాకీర్

ప్రజాశక్తి-ఆలూరు

పట్టణంలోని సచివాలయాల్లో ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదని సిపిఎం మండల కార్యదర్శి షాకీర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. శుక్రవారం స్థానిక సచివాలయం-2లో 4 గంటలకే కార్యదర్శి తప్ప మిగిలిన ఉద్యోగులు వెళ్లిపోయారని తెలిపారు. ప్రభుత్వం ఉద్యోగ ప్రకటనలు ఇచ్చే సమయంలో నిరుద్యోగులకు, ఆదాయ, ధ్రువ పత్రాల ఇవ్వకుండా విసుగిస్తున్న, సమయం పాటించని సచివాలయ ఉద్యోగులను వెంటనే తొలగించాలని కోరారు. నిరుద్యోగులు సచివాలయం చుట్టూ తిరగాల్సిన వస్తోందన్నారు. సచివాలయం-2లోని పని చేయకుండా, తూతూమంత్రంగా పని చేసే వారిపై చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేస్తామన్నారు.

నులి పురుగు నిర్మూలనపై అవగాహన అవసరం

- ఎంపిడిఒ నరేన్ సాహెబ్

ప్రజాశక్తి - చిప్పగిరి

పిల్లలందరికీ నులి పురుగుల నిర్మూలన వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైద్య సిబ్బందికి, సచివాలయ అధికారులకు, అంగన్వాడీలకు, ఆశాలకు ఎంపిడిఒ నరేన్ సాహెబ్, సిహెచ్ఒ వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవారం జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండల కార్యాలయంలో ఎంపిడిఒ, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నులి పురుగుల నిర్మూలన వల్ల రక్తహీనత నివారించవచ్చని, పోషక విలువను మెరుగుపరచవచ్చని తెలిపారు. విద్యార్థులకు చదువుపై ఏకాగ్రతను, నేర్చుకునే సామర్థ్యం పెంచుతుందని చెప్పారు. పరిపాలన అధికారి శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ శ్రీరాములు, జూనియర్ అసిస్టెంట్ ప్రకాష్, పంచాయతీ కార్యదర్శి సిసింద్రీ పాల్గొన్నారు. **ఆదోని (రూరల్)** మండలం బసాపురం గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మందులను పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ నబీ, ఎఎన్ఎం ఎం.జయమ్మ, సిహెచ్ఒ పూజ, ఉమా, శాంతి, హేమలత, ఆశాలు రామాంజినమ్మ, జి.జయమ్మ, ఈరమ్మ పాల్గొన్నారు. **హొళగుంద** మండలం ఎల్లార్తి గ్రామంలోని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రంలో ఆల్బెండజోల్ మాత్రలు ఇచ్చారు. యువ నాయకులు ఎస్‌కె.గిరి, హెల్త్ అస్టెటంట్ ఉమా బాయి, ఉపాధ్యాయులు అన్వర్, టిప్పు పాల్గొన్నారు.



ఆదోనిలో మందులు వేస్తున్న ఎఎన్ఎం, సిబ్బంది



చిప్పగిరిలో గోడపత్రికను విడుదల చేస్తున్న అధికారులు

నీరమ్ముకున్న సబ్ డివిజన్ అధికారులు

- ఎల్ఎల్‌సి బోర్డు మాజీ డైరెక్టర్ గడ్డం నారాయణ రెడ్డి

ప్రజాశక్తి - నందవరం



'రాయలసీమ పశ్చిమ ప్రాంతం మూడేళ్లు వరుసగా వర్షాల్లేక కరువు విలయతాండవం చేస్తోంది. ప్రజలు, రైతులు ఊళ్లొదిలి వలసలు వెళ్తున్నారు. కరువు సమయంలో ఎమ్మిగనూరు సబ్ డివిజన్ పరిధిలోని ఎల్ఎల్‌సి నీటిని ఆయకట్టు రైతులకు సక్రమంగా వదలాల్సిన అధికారులు నాన్ ఆయకట్టు రైతులకు ఎకరాకు దాదాపు రూ.5 వేల నుంచి రూ.7 వేలు వసూలు చేయడం ఏమిటి' అని ఎల్ఎల్‌సి బోర్డు మాజీ డైరెక్టర్ గడ్డం నారాయణ రెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. ఇలాంటి అధికారులపై ఎందుకు చర్యలు చేసుకోవడం లేదని నిలదీశారు. వర్షాలు కురవకపోతే ఆదుకోవాల్సిన ప్రభుత్వాధికారులే లంచావతారం ఎత్తి రైతులను ముంచడం దారుణమని విమర్శించారు. తక్షణమే ఇలాంటి అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చిన్నకొత్తిలి సబ్ డివిజన్ కింద ఉన్న హాలహర్వి దేశాయి చెరువుకు నీటిని వదలమని అడగడానికి వెళ్లిన రైతులపై అధికారి ఆగ్రహం వ్యక్తం చేయడం సిగ్గుచేటన్నారు. 'మీరు ఎమ్మెల్యే, ఎంపీ దగ్గరకెళ్లినా నాకేమీ భయం లేదు. మీకు నీరు మాత్రం వదలను. ముందు ఆఫీస్ నుంచి బయటకు వెళ్లండి' అని రైతులను అవమానించారని తెలిపారు. హాలహర్వి చెరువు కింద ఉన్న కొద్ది నీటిని చిన్న కారు రైతులకు వదలకుండా, నాన్ ఆయకట్టుకు నీరు విడిపించిన ఘనత ఆ అధికారికే చెందుతుందని అన్నారు. ఆయన అవినీతి వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ అధికారిపై కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చర్యలు తీసుకోకపోతే రైతులతో ఎస్ఇ కార్యాలయం, కలెక్టరేట్ ముందు ధర్నా చేపడతామని హెచ్చరించారు.

దేవరగట్టులో భక్తిశ్రద్ధలతో పూజలు

ప్రజాశక్తి - హొళగుంద

మండలంలోని నెరణికి, కొత్తపేట తండా కొండ గుహలో వెలిసిన శ్రీమాలమల్లేశ్వర దేవరగట్టు సన్నిధిలో శుక్రవారం అమావాస్య సందర్భంగా భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి భక్తులు ప్రత్యేక పూజల కోసం గిరిపైకి క్యూ కట్టారు. శ్రీమాల మల్లేశ్వర స్వామి వారికి అభిషేకం, బిల్వార్చన, బండ అర్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆకు పూజలు నిర్వహించారు. అర్చకులు గిరి స్వామి, మనోహర్ స్వామిలు స్వామివారి దర్శనం కల్పించారు. మరి కొంతమంది భక్తులు కింద నుంచి పైగిరి వరకు ప్రతి మెట్టుకూ కుంకుమ బండారు అంటించారు. భక్తులకు దేవరగట్టు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత అన్నదానం ఏర్పాటు చేశారు. అమావాస్య సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

త్రోబాల్ పోటీల్లో 'ఆరెకల్' ప్రతిభ

ఆదోనిరూరల్ : ఆదోని జోనల్ లెవెల్ జూనియర్ బాలుర త్రోబాల్ పోటీల్లో ఆరెకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కాంస్య పతకం సాధించారని ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యం తెలిపారు. శుక్రవారం ఆరెకల్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. త్రోబాల్ పోటీల్లో కాంస్య పతకం సాధించడం సంతోషకరమని తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులను, వ్యాయామ ఉపాధ్యాయులు విజయ సుశీలను పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు. వైసిపి గ్రామ నాయకులు వీరస్వామి, ఎస్ఎంసి చైర్మన్ నాగరాజు, గ్రామ పెద్దలు రామిరెడ్డి పాల్గొన్నారు.





శ్రీశైలంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులు

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

- ఆశాలపై పెట్టిన కేసులు ఎత్తివేయాలి
- ఆశా వర్కర్ల యూనియన్ డిమాండ్
- జిల్లా వ్యాప్తంగా తహశీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసన

ప్రజాశక్తి - విలేకరులు

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నంద్యాల జిల్లాలు వ్యాప్తంగా తహశీల్దార్ కార్యాలయాల ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు నిరసనలు చేపట్టారు. ఆత్మకూరు పట్టణంలో ఆశా వర్కర్లు ర్యాలీ చేపట్టారు. ఆశా వర్కర్లకు కనీస వేతనం చెల్లించాలని, చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లిన ఆశా వర్కర్లపై పెట్టిన కేసులను తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. తహశీల్దార్లకు, అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. గోస్పాడులో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ కుమారి పాల్గొని మాట్లాడారు.

నంద్యాల కలెక్టరేట్ : ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లిన ఆశ వర్కర్లపై, సిఐటియు నాయకులపై పెట్టిన కేసులను తక్షణమే ఎత్తివేయాలని ఏపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ కుమారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం గోస్పాడులోని తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆశాలు నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమానికి సుమలత అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి చలో విజయవాడకు వెళ్ళిన ఆశాలపై పోలీసులు ప్రవర్తించిన తీరు దారుణమన్నారు. ఎన్నికల ముందు సిఎం జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చ లేదన్నారు. చలో విజయవాడ కార్యక్రమంపై ప్రభుత్వం కనీసం సమస్యలపై స్పందించక పోవడం బాధాకరమన్నారు. ఆశాల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యధోరణి సరైంది కాదన్నారు. ఆశావర్కర్లకు, ఏఎన్ఎంలకు పని భారాన్ని తగ్గించాలన్నారు. అనవసరమైన యాప్‌లను తొలగించాలని కోరారు. ఆశా వర్కర్ ఏ కారణంతో చనిపోయినా రూ. 10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, దహన సంస్కారాలకు రూ. 25 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సెలవులు, వేతనంతో కూడిన సెలవులు అమలు చేయా లన్నారు. సంబంధం లేని పనులు చేయించ రాదన్నారు. ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, రాజకీయ జోక్యం లేకుండా చూడాలన్నారు. లేనిపక్షంలో భవిష్యత్తులో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆశాలు హుస్సేనమ్మ, ఈశ్వరి, **మిగతా 6వ పేజీలో...**



గోస్పాడు తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన చేపట్టిన ఆశా వర్కర్లు



ఆత్మకూరు పట్టణంలో ర్యాలీ చేపడుతున్న ఆశా వర్కర్లు, సిఐటియు నాయకులు

విద్యార్థుల ఆరోగ్యాన్ని సంరక్షించాలి

- జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులు
- జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం ప్రారంభం

ప్రజాశక్తి - శ్రీశైలం

ప్రతి విద్యార్థితో ఆల్బెండజోల్ మాత్రను మింగించి వారి ఆరోగ్యాన్ని సంరక్షించాలని జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం శ్రీశైలంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా ప్రతి సంవత్సరం ఆరు నెలలకు ఒకసారి జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 1 నుండి 19 సంవత్సరాలలోపు పిల్లలందరిచే ఆల్బెండజోల్ టాబ్లెట్లను మింగిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని కళాశాలలు, పాఠశాలల్లో మొత్తం 4,11,270 మంది విద్యార్థులు ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. అంగన్వాడీలు, పాఠశాల ఉపాధ్యాయులు పిల్లలందరితో ఆల్బెండజోల్ టాబ్లెట్లను తప్పనిసరిగా మింగించాలని తెలిపారు. 1 నుండి 2 సంవత్సరాల చిన్నారులకు సగం మాత్ర మెత్తగా నూరి తల్లిపాలతో కలిపి చెంచా ద్వారా ఇవ్వాలని, 2 నుండి 19 సంవత్సరాల పిల్లలకు మధ్యాహ్నం భోజనం తరువాత ఒక మాత్రను పూర్తిగా చప్పరించి నమిలి మింగించేటట్లు చర్యలు తీసుకోవాలని చెప్పారు. పాఠశాలలకు గైర్హాజరైన విద్యార్థులకు ఈ నెల 16వ తేదీ మాప్ అప్ రౌండ్‌లో మాత్రలు వేసేందుకు చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఒ డాక్టర్ వెంకటరమణ, డిసిహెచ్ఎస్ డాక్టర్ జఫరుల్లా, పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మోహనా, ఎంఎస్ఎలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు. **మహానంది :** మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందని ఎంపిహెచ్ఈఓ బీపీ హుస్సేన్ రెడ్డి పేర్కొన్నారు. మహానంది మండలం తిమ్మాపురం కస్తూర్బా బాలికల పాఠశాలలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఎన్ఎం భార్గవి, సుబ్బలక్ష్మమ్మ, పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు. **బనగానపల్లె :** నులిపురుగుల నివారణకు సంవత్సరం నుండి 19 సంవత్సరాల లోపు పిల్లలందరూ ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివశంకరుడు పేర్కొన్నారు. మండలంలోని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని టంగుటూరు సచివాలయం, జిల్లా పరిషత్ ఉన్నత **మిగతా 6వ పేజీలో...**

అతివేగం అత్యంత ప్రమాదకరం

- నంద్యాల పట్టణ డిఎస్‌పి రవీంద్రనాథ్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

అతివేగం అత్యంత ప్రమాదకరమని, ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని నంద్యాల టౌన్ డిఎస్‌పి రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా ట్రాఫిక్ పోలీస్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సంయుక్త ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలలో భాగంగా ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత నిబంధనలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులను పరిమితికి మించి ఆటోలో ఎక్కించరాదని, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, వాహనానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు మొదలైనవి కలిగి ఉండాలని తెలిపారు. మోటార్ సైకిల్‌పై ప్రయాణించే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని చెప్పారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ రవి శంకర్ నాయక్, రెడ్‌క్రాస్ అధ్యక్షులు దస్తగిరిలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యం చేరాలని తెలిపారు. కార్యక్రమంలో టౌన్ ఎస్ఐలు, ట్రాఫిక్ ఎస్ఐలు, సిబ్బంది, పట్టణంలోని డ్రైవింగ్ స్కూల్ యజమానులు, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డిఎస్‌పి రవీంద్రనాథ్ రెడ్డి

మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులు - ఏర్పాట్లపై ఎపి, తెలంగాణ, కర్నాటక అధికారులతో సమీక్ష

ప్రజాశక్తి - శ్రీశైలం

మార్చి 1 నుండి 11 వరకు శ్రీశైల క్షేత్రంలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో సామాన్య భక్తులకు అన్ని ఏర్పాట్లు పకడ్బంధీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం శ్రీశైలంలోని అన్నపూర్ణ భవనం పక్కన గల సిసి కంట్రోల్ రూమ్‌లో జిల్లా ఎస్‌పి రఘువీర్ రెడ్డి, దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డి వారి చక్రపాణిరెడ్డి, దేవస్థానం కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు, ఎపి, తెలంగాణ, కర్నాటక అధికారులతో కలిసి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 1 నుండి 11 వరకు 11 రోజుల పాటు నిర్వహించే మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సులువుగా మల్లన్నను దర్శించుకుని సురక్షితంగా ఇంటికి చేరుకునేలా అధికారులకు అప్పగించిన పనులను నిర్వహించాలని చెప్పారు. ప్రధానంగా క్యూలైన్లు, తాగునీటి సదుపాయం, ట్రాఫిక్, వాహనాల పార్కింగ్, నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుధ్యం తదితర అంశాలపై అప్పగించిన విధులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి నిర్వర్తించాలని ఆదేశించారు. రద్దీ ప్రాంతాలలో ఉచిత వైద్య శిబిరాలతో పాటు వైద్య నిపుణులు, అవసరమైన మందులను సిద్ధంగా ఉంచుకోవాలని డిఎంహెచ్ఒకు సూచించారు. దోమలను అరికట్టేందుకు ఫాగింగ్ మెటిరీయల్ సిద్ధంగా ఉంచుకోవాలని మలేరియా అధికారిని ఆదేశించారు. శ్రీశైలంలోని పిహెచ్‌సి, దేవస్థానం ఆసుపత్రి, సున్నిపెంటలోని వైద్యశాల, శ్రీశైలంలో ఏర్పాటు చేసే తాత్కాలిక 30 పడకల ఆసుపత్రి 24 గంటలపాటు నిర్వహించేలా వైద్యసిబ్బందిని కేటాయించాలన్నారు. 108 అంబులెన్సులు 7, పాదయాత్ర మార్గంలో 1 అంబులెన్సును ఏర్పాటు చేయాలని సూచించారు. బ్రాహ్మణకొట్కూరు నుండి శ్రీశైలం వరకు గతంలో సూచించిన విధంగా 31 ప్రదేశాలలో తాత్కాలిక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రవాణా సౌకర్యాల నిమిత్తం ఆంధ్ర ప్రాంతం నుండి 500 బస్సులు, తెలంగాణా నుండి 450, కర్ణాటక రాష్ట్రం నుంచి 170 కండీషన్‌లో ఉన్న బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు సంబంధిత రీజినల్ మేనేజర్లు కలెక్టర్‌కు వివరించారు. విఐపిలు, వివిఐపిలు, విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందికి వసతి ఏర్పాట్లలో ఎలాంటి సమస్యలు రాకుండా దేవస్థాన గదులు, ప్రయివేటు సత్రాలలో 35 శాతం గదులను స్వాధీనం చేసుకోవాలని ఆత్మకూరు ఆర్‌డిఒను ఆదేశించారు. ఆత్మకూరు నుండి దోర్నాల వరకు రోడ్డు ప్యాచింగ్ మరమ్మతులు, రేడియం స్టిక్కర్లు, రోడ్డుకిరువైపులా మట్టితో చదును చేసే పనులు వెంటనే ప్రారంభించాలని ఆర్‌అండ్‌బి ఇఇని ఆదేశించారు. దేవస్థానం ఇఒ డి.పెద్దిరాజు మాట్లాడుతూ భక్తులకు సులభంగా స్వామివారి దర్శనమయ్యేలా 4 రకాల క్యూలైన్లను ఏర్పాటు చేశామని వివరించారు. మహా శివరాత్రి పర్వదినం రోజు 1.10 లక్షల మంది స్వామివార్లను దర్శించుకునే అవకాశం ఉన్నందున అందుకు తగ్గ ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారిచక్రపాణిరెడ్డి మాట్లాడుతూ లడ్డూ ప్రసాదాలను 35 లక్షల వరకు తయారు చేస్తున్నామన్నారు. మార్చి 8వ తేదీ మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సాయంకాలం ప్రభోత్సవం, అనంతరం రాత్రి 10 గంటల నుండి పాగాలంకరణ, లింగోద్భవ కాల మహాన్యాస రుద్రదాభిషేకం, అర్ధరాత్రి 12 గంటలకు కల్యాణోత్సవం తదితర వైదిక కార్యక్రమాలన్నీ సాంప్రదాయబద్ధంగా నిర్వహిస్తామన్నారు. మరుసటి రోజు రథోత్సవం, తెప్పోత్సవం ఉంటాయని కలెక్టర్‌కు వివరించారు. ఎస్‌పి కె.రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ దోర్నాల నుంచి ట్రాఫిక్ అంతరాయం లేకుండా మార్గమధ్యంలో కమ్యూనికేషన్ గ్యాప్ లేకుండా సిస్టమును డెవలప్ చేసుకోవాలని తెలిపారు. శ్రీశైలం ముఖద్వారం, సాక్షిగణపతి ప్రదేశాలలో వాహనాలు నిలపకుండా చర్యలు చేపట్టాలని దేవస్థానం, అటవీశాఖ అధికారులకు సూచించారు. క్యూలైన్లలో భక్తులు తొక్కిసలాట లేకుండా అవసరమయ్యే మంచినీరు, చంటిపిల్లలకు పాలు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని ఇఒకు సూచించారు. భారీ వాహనాలను అటవీమార్గంలో అనుమతించకుండా డైవర్ట్ చేసేలా ప్రకాశం, నాగర్ కర్నూలు, కర్నూలు జిల్లాలో విస్తృత ప్రచారం చేయాలని ట్రాన్స్‌ఫోర్ట్, సంబంధిత ట్రాఫిక్ డిఎస్‌పిలను ఆదేశించారు.

ప్రాంతాల పరిశీలన : అనంతరం కలెక్టర్ సంబంధిత అధికారులతో టోల్‌గేట్, వలయ రహదారి (రింగురోడ్డు), యజ్ఞవాటిక, పార్కింగు ప్రదేశం, మల్లమ్మ కన్నీరు ప్రాంతం, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రక్కన గల పార్కింగు ప్రదేశం, ఆర్టీసీ బస్టాండు తదితర ప్రాంతాలను పరిశీలించారు. సమావేశంలో మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, డిఆర్ఒ పద్మజ, ఆత్మకూరు ఆర్‌డిఒ మిరియాల దాసు, అన్ని శాఖల జిల్లా అధికారులు, మార్కాపురం, దోర్నాల, తెలంగాణ, కర్ణాటక ప్రాంతాల సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఎస్‌పి రఘువీర్ రెడ్డి, పాల్గొన్న కలెక్టర్ కె.శ్రీనివాసులు



అభిమానులతో ఇరిగెల జయేంద్రారెడ్డి

ఘనంగా ఇరిగెల జయేంద్ర రెడ్డి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

జనసేన పార్టీ ఆళ్లగడ్డ తాలూకా అధికార ప్రతినిధి ఇరిగెల సూర్యనారాయణ రెడ్డి కుమారుడు, యువ నాయకులు ఇరిగెల జయేంద్ర రెడ్డి పుట్టినరోజు వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు కేక్ కటింగ్ చేసి ఒకరినొకరు తినిపించుకున్నారు. అనంతరం జయేంద్ర రెడ్డికి ఫోన్ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. తండ్రి సూర్యనారాయణ రెడ్డి అడుగుజాడల్లో జయేంద్ర రెడ్డి కూడా అవసరార్థం వచ్చిన వారికి చేతనైన సాయం చేస్తూ యువనేతగా అందరి మన్నలను పొందుతున్నారు.

జొన్నల విక్రయానికి ఆర్‌బికెల్లో దరఖాస్తు చేసుకోండి : ఎంపిపి

ప్రజాశక్తి - రుద్రవరం : జొన్న పంట విక్రయించుకోవడానికి రైతులు ఆయా రైతు భరోసా కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలని ఎంపిపి వసీం తెలిపారు. శుక్రవారం శిరివెళ్ల మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఎంపిపి వసీం అధ్యక్షతన మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ మండల పరిధిలో వరి పంటలు ఏవైనా నీటి ఎద్దడికి గురతుంటే వెంటనే సంబంధిత రైతు భరోసా కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. ఇప్పటివరకు మండలంలో 2,500 క్వింటాళ్ల జొన్న పంటలను కొనుగోలు చేసినట్లు తెలిపారు. జొన్న సాగు చేసిన రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సుధాకర్, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి వసీం



స్వచ్ఛభారత్ కార్మికులకు

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి - నంద్యాల

జిల్లాలోని ఆయా గ్రామాలలో పని చేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులకు 12 నుండి 22 నెలల వరకు ఉన్న పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.ఏసురత్నం, జిల్లా సహాయ కార్యదర్శి వి.బాలవెంకట్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామాలలో పరిశుభ్రత చేస్తూ, పర్యావరణాన్ని కాపాడుతూ ప్రజలను అంటురోగాల బారిన పడకుండా నిత్యం సేవలు చేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులకు నెలలు తరబడి వేతనాలు అందక కుటుంబాల పోషణ కష్టంగా మారిందని అన్నారు. 15వ ఫైనాన్స్ నిధులలో స్వచ్ఛభారత్ కార్మికులకు వేతనాలు ఇవ్వాలని ప్రభుత్వం సర్క్యులర్ ఇచ్చినా నేటికీ అధికారులు ఇవవకుండా నిర్లక్ష్యంగా ఉన్నారన్నారు. అధికారులు రెండు నెలలు మూడు నెలలు మాత్రమే వేతనాలు పెడుతూ పూర్తిస్థాయిలో ఇవ్వకుండా కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. పూర్తిస్థాయి పెండింగ్ వేతనాలు ఇవ్వమని అడిగితే పనులు చాలించుకోవాలంటూ కార్మికులను భయపెడుతున్నారని చెప్పారు. ఈ విషయం జిల్లా పంచాయతీ అధికారికి తెలియజేసినా ఎలాంటి చర్యలు లేవన్నారు. నెలల తరబడి వేతనాలు అందకపోతే కుటుంబాల పోషణ, పిల్లల చదువులు, వైద్యం ఎలా అని ప్రశ్నించారు. ప్రభుత్వ 4 సంవత్సరాల క్రితం ఇచ్చిన జీవో 680 ప్రకారం రూ. 10 వేలు వేతనం ఇవ్వాల్సి ఉండగా అధికారులు జీవోలను అమలు చేసే పరిస్థితి లేదన్నారు. జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని స్వచ్ఛభారత్ కార్మికులకు వేతనాలు అందేలా చూడాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు



జిఎం టాకీస్‌లో యాత్ర-2 సినిమాను చూస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

జిఎం టాకీస్‌లో 'యాత్ర-2' ప్రత్యేక షో

- వీక్షించిన ఎమ్మెల్యే కాటసాని, జడ్పి చైర్మన్ ఎర్రబోతుల

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని జిఎం టాకీస్‌లో దివంగత వైఎస్సార్ బయోపిక్‌గా దర్శకుడు మహి వి రాఘవ్ దర్శకత్వంలో వచ్చిన యాత్ర సినిమాకు సీక్వెల్‌గా యాత్ర-2 ప్రత్యేక షోను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి; జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిలు శుక్రవారం తిలకించారు. ఈ నెల 8న యాత్ర-2 సినిమా థియేటర్స్‌లో రిలీజ్ అయింది. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సినిమా ఉచితంగా చూసేలా బనగానపల్లె జీఎం జిఎం టాకీస్‌లో శుక్రవారం సాయంత్రం 6 గంటలకు ప్రత్యేక షోను ఏర్పాటు చేశారు. వైసిపి నాయకులు, కార్యకర్తలతో, అభిమానులతో కలిసి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, వైసిపి అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డిలు తిలకించారు.

రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ

ప్రజాశక్తి - మహానంది

మహానంది మండలం గాజులపల్లె గ్రామ పరిధిలోని బసాపురం రస్తాలో రూ. 2కోట్ల 23 లక్షలతో నూతనంగా వేయనున్న తారు రోడ్డు నిర్మాణానికి శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి శుక్రవారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. అలాగే మండలంలోని తిమ్మాపురం గ్రామంలో రూ. 35.20 లక్షలతో నిర్మించిన సిసి రోడ్లను, డ్రైనేజీ కాలువలకు సంబంధించి శిలా ఫలకాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం రూ. 9 లక్షలతో నిర్మించిన అంగన్వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా తిమ్మాపురం గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సంబంధింత జిల్లా అధికారులకు త్వరతిగతిన పరిష్కరించాలని చరవాని ద్వారా తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వర రెడ్డి, ఎంపిపి బుడ్డా రెడ్డి యశస్విని, ఎంపిడివో శివనాగజ్యోతి, తిమ్మాపురం సర్పంచి శ్రీలక్ష్మి, గాజులపల్లి సర్పంచ్ చంటి, వైసిపి మండల నాయకులు ఒంటెద్దు వీరారెడ్డి, నాగ భూపాల్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, పగడాల రాజు, మండల కన్వీనర్ కొమ్మ మహేశ్వర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రారంభోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

బిసి గురుకుల పాఠశాల ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-డోన్

వచ్చే ఏడా నికి (2024-25)డోన్ బాలుర గురు కుల పాఠ శాలలో 5వ తరగతిలో ప్రవేశానికి దర ఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్‌కోరారు. శుక్రవారం డోన్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్‌తో బిసి గురుకుల పాఠశాల బాయ్స్ ప్రిన్సిపల్ గోపాల్ , టీచర్ మధు మోహన్ భేటీ అయ్యారు. రాబోయే విద్యా సంవత్సరానికి ఐదవ తరగతికి ఎంట్రన్స్ కోసం ఎవరైనా విద్యార్థులు ఉంటే దరఖాస్తు చేసుకోవాల్సిందిగా మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. అర్హులైన విద్యార్థులు ఫిబ్రవరి 23లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మార్చి10న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాల కోసం https://apgpcet.apcfss.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ జాకీర్ , కౌన్సిలర్లు ఆర్ట్ రమణ, మేకల విమల, వైసిపి నాయకులు మేకల రాజు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ సప్తశైల రాజేష్



మాట్లాడుతున్న ఎంఇఒ

యాప్‌లను సమర్థవంతంగా నిర్వహించాలి : ఎంఇఒ

ప్రజాశక్తి - పాణ్యం : మధ్యాహ్న భోజన పథకం, గోరుముద్ద పథకం, ఆయా, నైట్ వాచ్‌మెన్‌లకు సంబంధించిన అన్ని రకాల యాప్‌లను సమర్థవంతంగా నిర్వహించాలని ఎంఇఒ కోటయ్య హెచ్ఎంలకు సూచించారు. శుక్రవారం పాణ్యం లోని మండల రిసోర్స్ భవనంలో హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. యాప్‌లపై శిక్షణ పొందిన ఎంఈఓ-2 సుబ్రమణ్యం అవగాహన కల్పించారు. ఆలాగే నులిపురుగుల నివారణకు అల్బెండో జోల్ మాత్రలు విద్యార్థినులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అన్ని పాఠశాలల హెచ్ఎంలు, ఎంఆర్‌సి రాజశేఖర్, శ్రీహరి పాల్గొన్నారు.

షాదీఖానాకు, కమ్యూనిటీ హాల్‌కు తేడా తెలియని ఎమ్మెల్యే : బిసి

ప్రజాశక్తి - బనగానపల్లె

షాదీఖానాకు, కమ్యూనిటీ హాలుకు మధ్య తేడా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి తెలియడం లేదని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి విమర్శించారు. శనివారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. పట్టణ చివరలో షాదీఖానా నిర్మిస్తున్నామని ముస్లిం మత పెద్దలతో, నాయకులతో భూమి పూజ చేయించిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ముస్లిములను ఎమ్మెల్యే మోసం చేస్తున్నారని ఆరోపించారు. తాను సొంత నిధులతో ముస్లింల కోసం షాదిఖానా నిర్మిస్తుంటే తనపై అక్రమ కేసులు పెట్టించారని తెలిపారు. 2023 నవంబర్‌లో షాదీ ఖానా నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే కాటసాని మూడు నెలలు అవుతున్నా పనులు చేయడం లేదని విమర్శించారు. టిడిపి అధికారంలోకి వస్తే ముస్లిములకు సొంత నిధులతో షాదీఖాను నిర్మిస్తానని తెలిపారు. బనగానపల్లె నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో టిడిపి జెండా ఎగరవేస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దీన్, టిడిపి పట్టణ అధ్యక్షులు ఖాసింబాబు, మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు రాయలసీమ సలాం, వార్డు మెంబరు టిప్ టాప్ కలాం, నాయకులు అల్తాఫ్ హుస్సేన్, సయ్యద్ హుస్సేన్, హర్షద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి



మాట్లాడుతున్న డాక్టర్ ధార సుధీర్

అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తా

- కౌన్సిలర్ల పరిచయ కార్యక్రమంలో ధార సుధీర్

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని వైసిపి నందికొట్కూరు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ధార సుధీర్ అన్నారు. శుక్రవారం నందికొట్కూరు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నందు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ కౌన్సిలర్లు కో- ఆప్షన్ సభ్యులతో పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్ మాట్లాడుతూ సీఎం జగన్మోహన్ రెడ్డి ఆశీస్సులతో, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి నాయకత్వంలో ఎమ్మెల్యేగా పోటీ చేయబోతున్నందుకు గర్వంగా ఉందని, ప్రజాసేవ చేయాలనే చిత్తశుద్ధి పట్టుదల నాకు ఉందని అన్నారు. ప్రతి ఒక్కరూ తన గెలుపుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ ప్రశాంతి, కో- ఆప్షన్ సభ్యులు కేశవరెడ్డి శ్రీనివాసరెడ్డి, అబ్దుల్ గఫార్, డి రమేష్, వార్డ్ ఇన్చార్జులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడి

పంట నమోదు చేయించుకోవాలి : ఏడి

ప్రజాశక్తి - కొత్తపల్లి

గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న రైతులు రబీ సీజన్లో పంటలు వేసిన రైతులు పంట నమోదు చేసుకోవడంతోపాటు ఈ కేవైసీ తప్పనిసరిగా చేయించాలని ఆత్మకూర్ ఏడి ఆంజనేయ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రమైన కొత్తపల్లిలో ఉన్న రైతు భరోసా కేంద్రం నందు మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం మండల వ్యవసాయ అధికారి మహేష్ ఆధ్వర్యం లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న రైతులు తమ పంటలను పంట నమోదు చేయించుకోవాలన్నారు. వ్యవసాయ అధికారులు రైతులతో కలిసి పంట నమోదు ఈ కేవైసీ చేయించాలన్నారు. అలాగే కరువు మండలాన్ని ప్రకటించడానికి కావలసిన సూచికలను రైతులకు వివరించడం జరిగింది. రబీ సీజన్లో పంట వేసిన ప్రతి రైతు ఈ నెల 15వ తేదీ లోపు పంట నమోదు, ఈ కేవైసీ చేయించుకోవాలని తెలిపారు. జొన్న పంటను ప్రభుత్వమే మద్దతు ధర 3180/-పై కొనుగోలు చేస్తుంది కాబట్టి రైతులు దలార్లో నమ్మి తక్కువ ధరకు అమ్ముకోవద్దని రైతులకు సూచించారు. పీఎం కిసాన్ నిధులు త్వరలో రైతుల ఖాతాలో జమ చేయబడతాయి, కాబట్టి ఇంకా ఈ కేవైసీ చేయించుకోనివారు రైతు భరోసా కేంద్రాలను సంప్రదించి ఈ కేవైసీ చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి భువనేశ్వరి వ్యవసాయ అధికారులు రైతులు ఉన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

5వ పేజీ తరువాయి.. బాలమ్మ, ప్రసన్న, లక్ష్మి, శివ పార్వతి, మరియమ్మ, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** ఆశా వర్కర్లకు కనీస వేతనం చెల్లించాలని, చలో విజయవాడ కార్యక్రమం వెళ్లిన ఆశావర్కర్లపై పెట్టిన కేసులను తక్షణమే ఎత్తివేయాలని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షురాలు పోచమ్మ, ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆశాలు నిరసన చేపట్టారు. అనంతరం తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని డిప్యూటీ తాసిల్దార్ రాజీవ్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు తులసి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూరు :** ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ నాయ కురాలు భారతిలు అన్నారు. శుక్రవారం పట్టణంలోని సుదర్శన వర్మ భవనం నుంచి గౌడ్ సెంటర్, కొత్త బస్టాండ్ మీదుగా తహసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చి, ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని ధర్నా చేసి డిప్యూటీ తహసిల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం చెల్లించే రూ.10 వేల వేతనంలో నెలకు రూ.3వేలు విధి నిర్వహణ సమయంలో ఖర్చు



బేతంచెర్ల : వినతి పత్రం ఇస్తున్న ఆశావర్కర్స్ యూనియన్ మండల కమిటీ

చేయాల్సి వస్తోందన్నారు. టీఏ, డిఏ చెల్లించడం లేదని, ఆశాలకు పని భారం ఎక్కువైందని, సమయం, సెలవులు లేవు ఆశా కార్యకర్తలు అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. చనిపోయిన ఆశాలకు ఎక్స్ గ్రేసియా, పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. ఆశాలకు సంబంధం లేని పనుల వలన తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మెటర్నరీ లీవులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించడం లేదన్నారు. సంక్షేమ పథకాలు ఇవ్వాలని, ప్రతినెల గౌరవ వేతనం మొత్తం ఒకటేసారి ఇవ్వాలన్నారు. ప్రమాద బీమా సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలి, రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు లక్ష్మీబాయి, సులోచన, చంద్రకళ, వెంకటరమణమ్మ, సామక్క, అపర్ణ, వరలక్ష్మి, శాంతి, రమిజాబీ, చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు. **బేతంచెర్ల :** ఆశావర్కర్ల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని ఆశావర్కర్స్ యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటలక్ష్మి, మండల కమిటీ సభ్యులు వై.పుష్పావతి, వి.ఆంజనమ్మలు కోరారు. బేతంచెర్ల పట్టణంలోని తహశీల్దారు కార్యాలయానికి ఆశావర్కర్లు బృందంగా పోయి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆశావర్కర్స్ యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి అర్.వెంకటలక్ష్మి తదితరులు మాట్లాడారు. తాసిల్దార్ జీవన్ చంద్రశేఖర్ మాట్లాడుతూ వినతి పత్రాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకపోయి సమస్యలు పరిష్కారం అయ్యేలాగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వై పుష్పావతి, అంజనమ్మ, కె.జ్యోతి,జి.నాగేంద్రమ్మ, జి.రమాదేవి, రాజేశ్వరి, లక్ష్మీదేవి, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

సుండిపెంటలో మాజీ ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

శ్రీశైలం నియోజకవర్గం శ్రీశైలం మండలం సుండిపెంటలో బాబు షఉరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం శ్రీశైలం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి సుండిపెంటలో సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా కాలనీలోని ఈస్ట్రాన్ కాలనీలో ప్రముఖంగా స్థానిక మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు సత్తిబాబు, ప్రముఖ కాంట్రాక్టర్, సాయిబాబా ఆలయ అధ్యక్షులు పి.భాస్కరరావు, విజయకృష్ణ ఏజెన్సీ అధినేత కొత్త వెంకటేశ్వరరావు,కోడిగుడ్ల భాష,కార్పెంటర్ మల్లీ, జామియా మసీదు మౌలానాలు,హజరత్లను నూరు అహమ్మద్‌ను కలిశారు. అలాగే వెస్టన్ కాలనీ నందు పాలబుజ్జి,శివప్రసాద్, సైకిల్ షాపు పీరా, మామిడికాయల శ్రీనివాసులు, టైలర్ దేవపాలు, కాంట్రాక్టర్ పెద్ద పుల్లయ్య, ప్రముఖ డాక్టర్. నాగరాజు, నల్లబోతుల మల్లికార్జునను మర్యాద పూర్వకంగా స్వయంగా గృహాలకు వెళ్లి కలిశారు. అనంతరము ఇంటింటి ప్రచారంలో రిక్షా కాలనీ, ప్రభుత్వ వైద్యశాల ఏరియా, శ్రీశైల మాత,వైజాగ్ క్యాంప్ ఏరియాలలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని రాత్రి 8 గంటల వరకు సుడిగాలి పర్యటన చేస్తున్నారు. ఈయన వెంట స్థానిక టిడిపి నాయకులు అడుసుమల్లి సుబ్బారావు,వీపీఎ బెంజమెన్,జంకె రామసుబ్బారెడ్డి,ఉమామహేశ్వరరావు, రూపస్,సురేష్,రమణ, మినిగ శ్రీను, శివయ్య, జనసేన నాయకులు నాగసాయి మహిళలు పాల్గొన్నారు.



పలువురు ప్రముఖులను కలిసిన మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి



ఫోర్‌లైన్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి పట్టణంలో రాయల్ కేఫ్ సమీపంలోని క్రీడా మైదానంలో పోర్‌లైన్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎస్ఐ రమణయ్య,పారిశ్రామిక వేత్త చక్రం బీడీ షబ్బీర్ అహమ్మద్‌లు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలలో జయాపజయాలను పక్కన పెట్టి క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. అనంతరం నిర్వహకులు సలీం,తాహీర్,వాజీద్‌లు మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 20 జట్లు పాల్గొంటు న్నాయన్నారు. ఈ పోటీలలో విజేతలకు మొదటి బహుమతి రూ 20 వేలు చక్రం బీడీ షబ్బీర్,రెండవ బహుమతి 10 వేలు గోల్డ్‌స్మిత్‌లు జమాల్,షరీఫ్, మూడవ బహుమతి రూ.5వేలు రాయల్ కేఫ్ రఫీ, నాల్గవ బహుమతి రూ.3,500 ముల్లా శ్యాబుల్,మ్యాన్ ఆఫ్ ది టోర్నమెంట్ బహుమతి రూ 3 వేలను అమరాన్ బ్యాటరీ డీలర్ ఆకుల ఇర్షాద్‌లు అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి రఫీ,పీడీ దాదాపీర్, దాతలు పాల్గొన్నారు.

ఒపిఎస్‌ను మేనిఫెస్టోలో చేర్చాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-డోన్

ఓపిఎస్ ను మేనిఫెస్టోలో ప్రకటించాలని యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు ఎం.వెంకట సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం డోన్ పట్టణం లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల యందు డోన్ యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి బివై సుబ్బారాయుడు అధ్యక్షతన ఓట్ ఫర్ ఓపిఎస్ పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు వెంకట సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికైనా ఉద్యోగులందరికీ ఓపిఎస్ ఇవ్వాలన్నారు. ఓపిఎస్ ఇచ్చేవరకు పోరాటం చేస్తామన్నారు. ఎవరైతే ఒపిఎస్‌ను అమలు పరుస్తారో వారికే ఉద్యోగులు సపోర్ట్ చేస్తారని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గోపాల్, సీనియర్ నాయకులు కేశవరెడ్డి,సుదర్శన్,రాణి, ప్రసాద్ ,రామక్రిష్ణ,గంగాధర్, మనోహర్ ,ఇబ్రహీం ,సురేష్,గ్రేసమ్మ, గాలి స్వామి, గోవిందరెడ్డి, వీరారెడ్డి, రాంభూపాల్ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి, సుజాత, నాయక్, ఇంతియాజ్, మురళి కష్ణ రెడ్డి, జగన్నాథ్ రెడ్డి,మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

13న విద్యుత్ ప్రత్యేక అవగాహన సదస్సు : ఎఇ

ప్రజాశక్తి - పాములపాడు

ఈనెల 13న ఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో శ్రీశైలంలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించడం జరుగుతుందని పాములపాడు ఎలక్ట్రికల్ ఏఈ అబ్దుల్ అబిద్ తెలిపారు ఈ అవగాహన సదస్సుకు చైర్ పర్సన్ శ్రీనివాస ఆంజనేయ మూర్తి హాజరవుతారని, విద్యుత్ వినియోగదారులకు ఏవైనా సమస్యలు ఉంటే రాతపూర్వకంగా ఫిర్యాదు చేసుకొని పరిష్కరించు కోవాల న్నారు. శ్రీ.వి శ్రీనివాస ఆంజనేయమూర్తి, చైర్పర్సన్(రిటైర్డు డిస్ట్రిక్టు జడ్జి), విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక, ఏపీఎస్పీడీసీఎల్ తిరుపతి వారి ఆధ్వర్యంలో శ్రీశైలం (కర్నూలు రూరల్ డివిజన్) పరిధిలో ప్రత్యేక విద్యుత్ అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సంక్షేమ పథకాలను ఉపయోగించుకోవాలి

- ఐటిడిఎ పిఒ రవీంద్రారెడ్డి

ప్రజాశక్తి - ఆత్మకూర్

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలుపరుస్తున్న సంక్షేమ పథకాలను గిరిజనులు సద్వినియోగ పరుచుకోవాలని ఐటీడీఏ పీవో రవీందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం నాడు పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో పీఎం జన్ మాన్ కార్యక్రమం ద్వారా గిరిజన గూడాలలో అమలు అవుతున్న 11 మౌలిక సదుపాయాలైన పక్కా గృహాలు మంచినీటి సరఫరా గూడాలలో రోడ్లు విద్యుత్ సోలార్ దీపాలు పాఠశాలలో వసతి సౌకర్యాలు వాటిపై గిరిజనులు అవగాహన పెంచుకొని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా బ్యాంకుల ద్వారా గిరిజన మహిళలకు రుణ సౌకర్యాలు అందిస్తున్నామని వాటిని తీసుకొని సకాలంలో చెల్లించాలని ఆర్థిక అభివృద్ధి సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ అధికారులు ధనుంజయ, కేజీ నాయక్, నాబార్డ్ అధికారి సుబ్బారెడ్డి, ఎల్‌డిఎం రవీంద్ర కుమార్ గిరిజనులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎపిఓ రవీంద్రారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బుగ్గన అర్జున్ అమర్నాథ్ రెడ్డి

డోన్ అభివృద్ధిపై సమీక్ష సమావేశం

ప్రజాశక్తి-డోన్

డోన్‌లో జరిగిన అభివృద్ధిపై సమీక్ష సమావేశం ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తనయుడు బుగ్గన అర్జున్ అమర్నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. శుక్రవారం డోన్ పట్టణంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తనయుడు బుగ్గన అర్జున్ అమర్నాథ్ రెడ్డి డోన్ పట్టణమునకు సంబంధం చినటువంటి కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు కార్యకర్త లతో సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో జరుగుతున్నటువంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు వాటిలో జరుగుతు న్నటువంటి పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా డోన్ నియోజకవర్గంలో రూ.3500 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేయడం జరిగిందని రాబోవు ఎలక్షన్లలో ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో మనం గెలిపించుకుంటే మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్,ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి,వైస్ చైర్మన్ జాకిర్ హుసేన్,జడ్పిటిసి రాజ్ కుమార్, నంద్యాల జిల్లా బీసీ అధ్యక్షుడు పోస్ట్ ప్రసాద్,మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ రామ చంద్రుడు,పట్టణ యూత్ అధ్యక్షుడు రాజవర్ధన్, కౌన్సిలర్లు,వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



నగదును అందిస్తున్న ధర్మవరం మన్నే గౌతమ్ రెడ్డి

ఆలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-డోన్

బేతంచెర్ల మండలంలోని బుక్కాపురం గ్రామంలో శ్రీ సీతారాముల గుడి నిర్మాణమునకు డోన్ నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి స్వగృహంలో శుక్రవారం 25,000 వేల రూపాయల విరాళాన్ని డోన్ నియోజకవర్గ టిడిపి యువ నాయకులు ధర్మవరం మన్నే గౌతమ్ రెడ్డి చేతుల మీదుగా బుక్కాపురం గ్రామస్థులు లక్ష్మణ్, కృష్ణుడు,శేఖర్,మల్లిఖార్జున లకు అందజేశారు.

సిఎం జగన్ మహిళల ఆత్మ గౌరవం పెంచారు

రాష్ట్ర మీట్ చైర్మన్ శ్రీరాములు

ప్రజాశక్తి - ప్యాపిలి

సీఎం జగన్ మహిళల ఆత్మగౌరవాన్ని పెంచారని రాష్ట్ర మీట్ చైర్మన్ శ్రీరాములు, జెడ్పిటిసి శ్రీరాంరెడ్డి, ఇన్ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ పుల్లారెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ మల్లికార్జున రెడ్డి అన్నారు. స్థానిక లక్ష్మీ నరసింహ ఫంక్షన్ ఫంక్షన్ హాల్‌లో వైయస్సార్ ఆసరా కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వైయస్సార్ ఆసరా పథకం మొదటి విడతగా 927 సంఘాలకు 9165 సభ్యులకు 482.88, రెండవ విడతలో 932 సంఘాలకు 9205 సభ్యులకు 490.14, మూడో విడతలో 932 సంఘాలకు 9205 సభ్యులకు490.14, నాలుగవ విడతలో 932 సంఘాలకు 9205 సభ్యులకు490.15 మొత్తం ఇప్పటి వరకు 19 కోట్ల 53 లక్షల 30 వేల రూపాయలు మంజూరైనవి అన్నారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎన్నికల మేనిఫెస్టో ప్రకటించిన తొమ్మిది పథకాలలో ఒకటని, డ్వాక్రా పొదుపు సంఘాల మహిళలు తీసుకున్నటువంటి రుణాలను రాష్ట్ర ప్రభుత్వం తిరిగివారికి నాలుగు దశల్లో చెల్లిస్తుందని, ఈ పథకం అమలు ద్వారా ఆంధ్రప్రదేశ్లో నివసిస్తున్న నిరుపేద మహిళలకు ఆర్థిక సహాయం అందించబడుతుందని, మహిళా సాధికారత రేటును పెంచుతుందని, మైనార్టీ వర్గానికి చెందిన మహిళలకు స్వయం సహాయక సంఘం రుణం ఇవ్వబోతుందని, ఈ పథకం ద్వారా మొత్తాన్ని నేరుగా లబ్ధిదారుడు బ్యాంక్ ఖాతాల్లోకి చెల్లిస్తున్నారన్నారు. దాదాపు 9 లక్షల మంది లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. వచ్చే ఎన్నికలలో జగన్ను మరొకసారి ఆశీర్వదించాలని మహిళలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాయి మనోహర్, యు ఆర్ డి బాలకృష్ణ, అలేబాదు బాలయ్య, ఏపిఎం కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర మీట్ చైర్మన్ శ్రీరాములు

పట్టణ ఎస్ఐగా వెంకటరమణ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - నందికొట్కూరు



నందికొట్కూరు పట్టణ ఎస్సైగా పి. వెంకటరమణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలో ప్రధాన సమస్యలైన ట్రాఫిక్, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రజలకు ఎల్లవేళల అందుబాటులో ఉంటానని అదేవిదంగా అసాంఘిక కార్యక్రమాలైనా అక్రమ మద్యం, నాటుసారా, దొంగతనం, మట్కా తదితర కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ కనబరచడం జరుగుతుందని, చట్టా వ్యతిరేక కార్యక్రమాలకు ఎవరు పాల్పడిన సహించేది లేదని, చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

విద్యార్థుల ఆరోగ్యాన్ని సంరక్షించాలి

5వ పేజీ తరువాయి.. పాఠశాల, ఎంపీపీ పాఠశాల , కైప సచివాలయం, అప్పలాపురం ఎంపీపీ పాఠశాలల్లో టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివ శంకరుడు డాక్టర్ సోయల్ బాబులు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఎంబీహెచ్ఈఓ వెంకటేశ్వర్లు సూపర్వైజర్ అయ్యమ్మ, స్టాఫ్‌నర్స్ శివ, చార్మి ఏఎన్ఎం అరుణమ్మ, దస్తగిరిమ్మ, అబేద, ఆశ వర్కర్లు పాల్గొన్నారు. **కొత్తపల్లి :** వ్యక్తిగత పరిశుభ్రతతోనే నులిపురుగుల నిర్మూలన నివారణ సాధ్యమని జిల్లా ప్రోగ్రాం పర్యవేక్షణ అధికారి డాక్టర్ సునీత తెలిపారు. మండల పరిధిలోని దుద్యాల గ్రామంలో ని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహనా కల్పించారు. ఈ సందర్భగా వారు మాట్లాడారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను విధిగా పాటించాలని తెలిపారు. నులి పురుగులను నివారించాలంటే ఆల్బండజోలు మాత్రలను వేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో వైద్యధికారి గోపాల్,పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంగన్న, సిహెచ్ఓ బాలకృష్ణ, పి.హెచ్.ఎన్ అయేషా బేగం సూపర్వైజర్ గుర్రప్ప, చెరుకు రవికుమార్, మస్తానయ్య,హెల్త్ అసిస్టెంట్ త్రివేణి, విమల వ్యాయామ ఉపాధ్యాయులు చంద్రశేఖర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **ఆత్మకూరు :** నంద్యాల జిల్లా ప్రోగ్రాం మానిటరింగ్ ఆఫీసర్ డాక్టర్ సునీత, ఆత్మకూరు పట్టణ చైర్ పర్సన్ డాక్టర్ మరుఫ్ ఆసియా, మెడికల్ ఆఫీసర్ బైర్లూటి డాక్టర్ గోపాల్. మెడికల్ ఆఫీసర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆత్మకూర్ డాక్టర్ సాజిదా ఫిర్దోస్, సీనియర్ ట్రీట్మెంట్ సూపర్వైజర్ కల్లూరి పెద్ద మస్తానయ్య, సిజేవీ రవికుమార్, ఆత్మకూరు పట్టణ కమిషనర్ పి శ్రీనివాసులు,ఎంఈఓ జానకి రాముడు తదితరులు గవర్నమెంట్ హైస్కూల్ నందు ఆల్బెండజోల్ మాత్రలు విద్యార్థులకు అందించుటను మానిటరింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో హెడ్ మాస్టర్ నాగరాజు, పాఠశాల ప్రథమ సహాయకుడు నయుం, ఫిజికల్ డైరెక్టర్ దేవానంద్, వార్డ్ హెల్త్ సెక్రటరీ సుబ్బలక్ష్మి, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్ :** నందికొట్కూరు పట్టణంలోని కర్నూల్ రోడ్ బైరెడ్డి నగర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల (కోట) నందు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ శ్రీనాథ్ పెరుమాళ్ళ ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు సలీం బాష, పాఠశాల జీవ శాస్త్ర ఉపాధ్యాయులు మల్లిఖార్జున రెడ్డి పలు సూచనలు చేశారు. అనంతరం ఆరోగ్య సిబ్బంది 250 మంది పిల్లలకు అల్బెండజోల్ మాత్రను ఉచితంగా పంపిణీ చేశారు. హెల్త్ సెక్రెటరీ విజయ లక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు శారదమ్మ, లలతమ్మ, సాలమ్మ, శంషాదు బేగం, సరోజినీ దేవి,వెంకటేశ్వర్లు, ఆశా వర్కర్ లక్ష్మీ దేవి తదితరులు పాల్గొన్నారు. **పాములపాడు:** జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఒకటి నుండి 19 సంవత్సరాల లోపు వారికి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసినట్లు మండల వైద్య అధికారిని నాగలక్ష్మి దేవి తెలిపారు. మండలంలో 7817 విద్యార్థులకు గాను7559 విద్యార్థులకు మాత్రలు వేయించి 96% పూర్తి చేసినట్లు తెలిపారు. **అవుకు:** ఉప్పలపాడు ప్రాథమిక వైద్యులు డాక్టర్ వినోద్ కుమార్ అవుకు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల బాలుర ఉన్నత పాఠశాలలో నులిపురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రాలను విద్యార్థులకు మింగించారు. ఎంఈఓ వెంకటేశ్వర్ రెడ్డి, వైద్యులు వినోద్ కుమార్ డాక్టర్ యమునా మాట్లాడారు. మండలంలో తొమ్మిది వేల మంది విద్యార్థులు ఉన్నారని విద్యార్థులు అందరికీ ఆల్బెండజోలు మాత్రలను పంపిణీ చేయడం జరిగిందని డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు.



ఆత్మకూరు : పరిశీలిస్తున్న జిల్లా ప్రోగ్రాం వైద్యధికారి



కొత్తపల్లి : మాత్రలు వేస్తున్న జిల్లా ప్రోగ్రాం వైద్యధికారి